# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 244 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 25 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 244 25-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## కర్పూరీ ఠాకూర్‌కు నివాళులు అర్పించి.. బిహార్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన మోదీ



ఢిల్లీ : బిహార్ అసెంబ్లీ ఎన్నికలను అటు ఎన్డీయే.. ఇటు ఇండియా బ్లాక్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సమస్తీపుర్ జిల్లాలోని కర్పూరీ గ్రామం అందుకు వేదికైంది. బిహార్ మాజీ సీఎం, దివంగత నేత కర్పూరీ ఠాకూర్‌కు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను కలిశారు. ఈ సందర్భంగా రోజ్‌గార్‌మేళాను ఉద్దేశించి ప్రసంగించారు. "యువతకు సాధికారత కల్పించడమే మా కూటమి ప్రాధాన్యం. ఫెస్టివల్ సీజన్‌లో ఆఫర్ లెటర్స్ అందుకోవడం వేడుకలను రెట్టింపు చేస్తుంది. ఈ రోజు 51 వేల మంది యువత ఆ ఆనందాన్ని పొందుతున్నారు. అది నాకు ఆనందాన్నిస్తోంది. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారికి కృతజ్ఞతలు" అని మోదీ అన్నారు.

## బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నాం

మొత్తం 19 మంది చనిపోయారు...

హోంమంత్రి అనిత

దుర్ఘటనపై 16 బృందాలతో లోతైన దర్యాప్తునకు ఆదేశం

ఏపీకి చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం

డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతదేహాల గుర్తింపు ప్రక్రియ



కర్నూలు అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కర్నూలు జిల్లాలో చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ భయంకర ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ప్రమాదంపై లోతైన దర్యాప్తు కోసం 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక

- తరువాయి 2లో..

# ఘోర ప్రమాదం...

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం

20 మంది మృతి

19 మంది మృతదేహాలు వెలికితీత





కర్నూలు అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్నది. ఈ క్రమంలో ఈరోజు తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కర్నూలు శివారు చిన్నటేకూరు సమీపంలో బస్సు ఓ బైకును ఢీట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్రమంగా బస్సు మొత్తం అగ్నికి దగ్ధమైంది.

- మిగతా 2లో..



## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు..

- నిర్లక్ష్యమే కారణమని తేలితే కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు
- కర్నూలు బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- మృతుల కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశాలు
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచన
- రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ బస్సుల ఫిట్‌నెస్‌పై తనిఖీలకు నిర్ణయం
- నిర్లక్ష్యమే కారణమని తేలితే కఠిన చర్యలు తప్పవని ట్రావెల్స్ యాజమాన్యాలకు హెచ్చరిక
- ప్రమాదానికి గురైన బస్సుపై పూర్తి నివేదిక కోరిన ముఖ్యమంత్రి





కర్నూలు అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కర్నూలు సమీపంలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన శుక్రవారం ఉన్నతస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో

- తరువాయి 2లో..

## తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ వన్ చేస్తా...

### దుబాయ్ వేదికగా సీఎం చంద్రబాబు ధీమా

- దుబాయ్‌లో ఘనంగా తెలుగు డయాస్పోరా కార్యక్రమం
- భారీగా తరలివచ్చిన గల్ఫ్ దేశాల ప్రవాసాంధ్రులు
- తెలుగు జాతిని ప్రపంచంలోనే నెంబర్ 1గా నిలుపుతామన్న చంద్రబాబు
- గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు విశాఖకు గూగుల్ అని వెల్లడి
- ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యమని ఉద్ఘాటన

దుబాయ్, అమరావతి అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

యూఏఈ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, గల్ఫ్ దేశాల్లోని తెలుగు ప్రజలతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. తన పర్యటనలో చివరి కార్యక్రమంగా దుబాయ్‌లోని లీ మెరిడియన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన



లభించింది. యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్, బహ్రెయిన్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి ప్రవాసాంధ్రులు, తెలుగు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సభకు మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఏపీ ఎన్నార్టీ చైర్మన్ వేమూరి రవి తదితరులు హాజరయ్యారు. అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. "ప్రపంచంలో తెలుగు జాతికి తిరుగే లేదు. ప్రపంచంలో తెలుగు జాతిని నెంబర్‌వన్‌గా

- తరువాయి 2లో..

## త్వరలో యూఏఈ - ఏపీ మధ్య సరికొత్త వాణిజ్య బంధం

ఆశావహంగా ముగిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు యూఏఈ పర్యటన

రాష్ట్రంలో అవకాశాలు పరిశీలించాలని యూఏఈ మంత్రులకు ఆహ్వానం

పర్యటన చివరి రోజూ పలు సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు

దుబాయ్, అక్టోబర్ 24 : (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

యూఏఈలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటన ఆశావహంగా ముగిసింది. అటు ప్రభుత్వ ప్రతినిధులు, ఇటు వాణిజ్య సంస్థ అధిపతులతో వరుస సమావేశాలతో






యూఏఈ-ఏపీ మధ్య సరికొత్త వాణిజ్య బంధానికి తెరతీశారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించాలని వారిని ఆహ్వానించారు. పర్యటన చివరిరోజు శుక్రవారం దుబాయ్‌లో ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..

## ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉంది

- మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్
- ఏపీకి 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే
- దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది
- విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుంది
- మెల్ బోర్న్ లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షో లో మంత్రి నారా లోకేష్
- విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం



మెల్ బోర్న్(ఆస్ట్రేలియా): ఆంధ్రప్రదేశ్ కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆరో రోజు.. ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్(%ూ×దీజ%) ప్రతినిధులతో మెల్ బోర్న్ లోని గ్రాండ్ హయత్ హోటల్ ది రెసిడెన్సీ హాల్ లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి

- తరువాయి 2లో..

## ఏపీకి తుపాను ముప్పు..

అధికారులను అప్రమత్తం చేసిన హెూంమంత్రి అనిత

బంగాళాఖాతంలో అల్పపీడనం

సోమవారానికి తుపానుగా మార్పు

సన్నద్ధతపై అధికారులతో హెూంమంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష

రానున్న రోజుల్లో ఏపీకి అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాల హెచ్చరిక

ప్రాణనష్టం జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం

సహాయక చర్యల కోసం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేయాలని సూచన

అమరావతి అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 48 గంటల్లో తుపానుగా బలపడనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపానును ఎదుర్కొనేందుకు

- తరువాయి 2లో..



## ఉమ్మడి శిక్షణా శిబిరాలు, దృష్టి సారించండి

క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్ లతో మంత్రి నారా లోకేష్ భేటీ

భారత్‌లో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడి

ఆస్ట్రేలియా (మెల్బోర్న్): ఏపీలో ప్రతిభగల క్రికెట్ క్రీడాకారులను గుర్తించడానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యాన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)ను నిర్వహిస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ లో క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్ లతో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. ఏపీ క్రీడాకారులను ఐపీఎల్ స్థాయికి తీసుకెళ్లడమే ఏపీఎల్ ముఖ్యోద్దేశం. IPL 2025 మెగా వేలంలో ఆంధ్రప్రదేశ్ (APL) నుండి షేక్ రషీద్, త్రిపూర్ణ విజయ్, నితీష్ రెడ్డి, సత్యనారాయణ రాజు, పైలా

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## శాంతి ఒప్పందానికి తూట్లు

రెండేళ్ల పాటు పాలస్తీనాపై విరుచుకుపడి, 68 వేలమందిని పొట్టన పెట్టుకున్నా ఇజ్రాయెల్ రక్తదాహం తీరలేదు. 20 సూత్రాల శాంతి పథకం పేరిట యుద్ధ విరమణ ప్రకటించాక కూడా నయవంచనకు పాల్పడుతోంది. నరమేధానికి తెగబడుతోంది. యుద్ధ విరమణ చేయించానని గప్పాలు కొట్టుకున్న అమెరికా అధినేత ట్రంప్ ఈ దాష్టీకాన్ని, దారుణాలనూ చూస్తూ ఊరుకుంటున్నారు తప్ప %-% మాట తప్పుతున్న మతిమాలిన చర్యలపై కిమ్మనటం లేదు. యుద్ధం ముగించామని చెప్పిన కొద్ది గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్ మిలటరీ పాలస్తీనా పౌరులపై కాల్పులకు బరి తెగించింది. యుద్ధం ముగిసిందని సంబరపడి సొంతూరుకు వస్తున్న ఒక కుటుంబంపై కాల్పులు జరిపి, 11 మంది ప్రాణాలు బలిగొంది. అన్ని రకాల అంతర్జాతీయ సూత్రాలను, మానవతా విలువలను కర్కశంగా అణగదొక్కి నెతన్యాహు నేతృత్వంలోని ఇజ్రాయెల్ యుద్ధ కావరం ప్రదర్శిస్తూనే ఉంది. తన ఉన్మాదపు దాడుల్లో ఆసుపత్రులు ధ్వంసమైనా, పాఠశాలలు కుప్పకూలినా, వేలాది మంది పసిపిల్లలు ప్రాణాలు కోల్పోయినా, అమాయక పౌరులు బలైనా %-% ఈ రెండేళ్ల కాలంలో ఒక్క చిన్న పశ్చాత్తాప ప్రకటన కూడా చేయలేదు. కళ్లు మూసుకొని విచక్షణారహితంగా రక్తపాతం సృష్టిస్తూనే ఉంది.

ఈ మారణకాండను ఐక్యరాజ్య సమితి తప్పు పట్టింది. అంతర్జాతీయ నేరవిచారణ న్యాయస్థానం నెతన్యాహుపై అరెస్టు వారంటు జారీ చేసింది. ఐక్యరాజ్య సమితి సమావేశాల్లో అతడు మాట్లాడబోతుంటే- అనేక ప్రపంచ దేశాలు వేదికను బహిష్కరించాయి. ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజం తీవ్రంగా ప్రతిస్పందించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సహా అన్ని దేశాల్లో లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి, ఇజ్రాయెల్ దుర్మార్గ దాడులను ఖండిస్తూ- పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు నిర్వహించారు. అయినా, ఆ దేశం కళ్లు తెరవలేదు. కనీస మానవతా దృక్పథాన్ని ప్రదర్శించలేదు. పాలస్తీనా పట్ల అత్యంత కర్కశంగా, అమానవీయంగా వ్యవహరించింది. ఆకలితో అల్లాడుతున్న పిల్లలు ఆహార ట్రక్కుల వద్దకు అర్రులు చాచి పరుగులు పెడితే- బాంబులు కురిపించింది. మానవతా సాయం అందిస్తున్న ఐక్యరాజ్యసమితి సిబ్బంది పైనా, గాజా దుర్భర స్థితిని బయటి ప్రపంచానికి నివేదిస్తున్న విలేకరులపైనా కాల్పులకు తెగబడింది. సుమారు 300 మంది విలేకరులను, 1700 మంది వైద్య సిబ్బందిని పొట్టన పెట్టుకొంది. ఒకప్పుడు హిట్లర్ జాత్యాహంకారానికి బలైన ఇజ్రాయెల్ ఈనాడు ఇంతగా బరితెగించటానికి దాని దురాక్రమణ కాంక్ష ఒక్కటే కాదుబీ సామ్రాజ్యవాద అమెరికా వంత కూడా కారణమే! యుద్ధవిరమణ ప్రకటన తొలి రోజు నుంచే ఉల్లంఘనకు గురవ్వటానికి టెల్ అవీవ్‌తో పాటు వాషింగ్టన్ కూడా బాధ్యత వహించాల్సిందే!

వాస్తవానికి 20 సూత్రాల పథకం పేరుకే శాంతిమంత్రం. ఇజ్రాయెల్ ఆధిపత్యానికి, దురాక్రమణ దాష్టీకానికి చెల్లుచీటి రాసే నిబంధన అందులో ఒక్కటీ లేదు. ఇజ్రాయెల్ మిలటరీ పాలస్తీనాలో ఇంకా తిష్ట వేసుకునే ఉంది. దురాక్రమించిన గాజా భూభాగంలోని 53 శాతాన్ని తన గుప్పిట్లోనే పెట్టుకొంది. తనకు ఇచ్ఛ కలిగిన ప్రతి రోజూ కాల్పులు జరుపుతూనే ఉంది. అనుమానం వచ్చిన లక్ష్యాలపైనే తమ దాడులు కొనసాగుతున్నాయని నెతన్యాహు నిస్సిగ్గుగా ప్రకటించటం, విరమణ అనంతర హత్యలను సమర్థించుకోవటం ఎంత అమానుషం! హమాస్ నిరాయుధం అయ్యేదాకా తమ కత్తులు గాజా మెడపై వేలాడుతూనే ఉంటాయని ఇజ్రాయెల్ హూంకరించటం %ా% ఎలాంటి శాంతిస్థాపనో ఒప్పందంపై గొప్పలు వల్లిస్తున్న అమెరికా వివరించాలి.

గాజాను నిర్మానుష్యం చేసి, దానిని చెరబట్టటమే వ్యూహంగా ఇజ్రాయెల్ సాగుతున్నట్లు కనిపిస్తోంది. యుద్ధ విరమణ అనేది నిబద్ధత లేని ఒక ప్రహసనంగా గడచిన ఇరవై రోజుల్లో తేలిపోయింది. గతంలో కాల్పుల విరమణ సందర్భంలోనూ ఇజ్రాయెల్ ఇలాంటి ఏకపక్ష ఉల్లంఘనలకే పాల్పడింది. నిజంగానే శాంతిస్థాపన చేయాలనుకుంటే %-% ఇజ్రాయెల్ యుద్ధకావరానికి గట్టి కళ్లెం వేయాలి. అమెరికా, బ్రిటన్ వంటి అగ్రదేశాలు ఉదాసీన వైఖరిని విడనాడాలి. శాంతిస్థాపన అనేది స్విచ్ బటన్ లాంటిది కాదు. అదొక నిరంతరమైన దౌత్య ప్రక్రియ. అలాంటి చిత్తశుద్ధితో కూడిన కృషి ఇప్పుడు చాలా అవసరం. తీవ్రమైన విద్వేషానికి, విధ్వంసానికి గురైన పాలస్తీనాకు తన భూభాగం మీద సర్వ స్వతంత్రత కల్పించి, ప్రపంచ దేశాలు అండదండగా నిలబడాలి.

## ఘోర ప్రమాదం...

బస్సులో అంతా నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో పలువురు సజీవదహనమయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఎమర్జెన్సీ డోర్ నుంచి 20 నుంచి 25 మంది వరకు బయటపడినట్లు, 20 మంది వరకు దుర్మరణం చెందినట్లు సమాచారం. బైక్‌పై వెళుతున్నవారు కూడా మరణించారు. పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. గాయపడినవారిని కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. వారిలో ఎవరికీ ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ప్రమాదం తర్వాత ఘటనా స్థలం నుంచి ట్రావెల్స్ బస్సు డ్రైవర్, సిబ్బంది పరారయ్యారు. ప్రయాణికుల్లో ఎక్కువమంది హైదరాబాద్ నగరానికి చెందినవారు ఉన్నట్లు సమాచారం. అగ్నిప్రమాదం జరగడంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**19 మంది మృతదేహాలు వెలికితీత**

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాదంలో 19 మంది మృతదేహాలను వెలికితీసినట్లు కలెక్టర్ సిరి తెలిపారు. ఫోరెన్సిక్ బృందాలు వచ్చిన తర్వాత బస్సులో నుంచి వెలికితీశాయి. బైక్ పూర్తిగా బస్సు కిందికి వెళ్లిపోయిందన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. బస్సు ప్రయాణికుల్లో 39 మంది పెద్దలు, ఇద్దరు పిల్లలు ఉన్నారని డీజీ కోయ ప్రవీణ్ తెలిపారు. సురక్షితంగా ఉన్న 19 మందిని గుర్తించామని, వారికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటంతో తేరుకునేలోపు బస్సు దగ్ధమైందన్నారు. ప్రధాన డ్రైవర్ కనిపించడం లేదన్నారు. మరో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. బస్సు డీజిల్ ట్యాంకర్ దెబ్బతినలేదన్నారు. బైక్‌ను ఢీకొన్న తర్వాత మంటలు చెలరేగడం వల్లే ప్రమాదం జరిగిందని వివరించారు.

ప్రమాదం నుంచి బయటపడిన వాళ్ల వివరాలు..

ఎం.సత్యనారాయణ, సత్తుపల్లి, ఖమ్మం జిల్లా
జయసూర్య, మియాపూర్, హైదరాబాద్
నవీన్ కుమార్, హయత్‌నగర్, హైదరాబాద్
సరస్వతి నిహరిక, బెంగళూరు
నీలకుర్తి రమేశ్, ఆయన భార్య శ్రీలక్ష్మి, కుమార్తె జశ్విత, కుమారుడు అభిరామ్, కొత్తపేట, నెల్లూరు జిల్లా
కావలి అశోక్, కావలి శ్రీహర్ష, నెల్లూరు

కంట్రోల్ రూమ్ నంబర్లు %

%కలెక్టరేట్‌లో: 08518-277305.
కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో: 91211 01059.
ఘటనాస్థలి వద్ద: 91211 01061.
కర్నూలు పోలీసు స్టేషన్‌లో: 91211 01075.
కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో(హెల్ప్ డెస్కు) : 94946 09814, 90529 51010

**మృతదేహాలకు ప్రమాదస్థలి వద్దే డీఎన్ఏ, పోస్టుమారం టెస్టులు**

ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతుండగా, మృతదేహాలను వెలికితీశారు. అయితే, మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో, ఘటనా స్థలంలోనే వైద్య బృందాలు పోస్టుమార్టంతో పాటు డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలను సేకరిస్తున్నాయి. డీఎన్ఏ రిపోర్టులు వచ్చిన తర్వాత, వాటి ఆధారంగా మృతులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు బంధువులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. మరోవైపు, ఈ ప్రమాదంలో గాయపడిన వారి గురించి కూడా సూపరింటెండెంట్ వివరాలు తెలిపారు. మొత్తం 12 మందికి ఆసుపత్రిలో వైద్యం అందించగా, స్వల్ప గాయాలైన 8 మందికి ప్రథమ చికిత్స చేసి డిశ్చార్జి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఒకరికి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, మిగిలిన ముగ్గురి పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆయన వివరించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

**పలువురు దిగ్భ్రాంతి**

కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తమనెంతో కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్‌గ్రేషియాను ప్రధాన మంత్రి కార్యాలయం ప్రకటించింది. ఈ ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ఇవ్వనున్నట్లు శుక్రవారం పిఎంఒ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

**చాలా బాధాకరం %-% రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

బస్సు అగ్ని ప్రమాదంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమైన విషయం. మృతుల కుటుంబ సభ్యులకు నా సానుభూతిని వ్యక్తం చేస్తున్నా. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి.

**ప్రాణ నష్టం చాలా బాధాకరం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ**

బస్సు ప్రమాదంలో జరిగిన ప్రాణ నష్టం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి. మృతులకు 2 లక్షలు, గాయపడిన వారిక రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

**తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి : లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ**

బస్సు అగ్ని ప్రమాదంలో ఎంతో మంది అమాయకులు మరణించిన ఘటన బాధాకరం. ప్రాణాలు కోల్పయిన వారి కుటుంబ సభ్యులకు నా సంతాపం తెలుపుతున్నా. ఇటువంటి పునరావృత ప్రమాదాలు మన ప్రజా రవాణా వ్యవస్థ భద్రతా ఏర్పాట్ల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రయాణికుల భద్రత అత్యంత ప్రాధాన్యత, వాహన నిర్వహణ బాధ్యతతో పాటు, జవాబుదారీతనం చాలా అవసరం.

**ఘోర ప్రమాదం తీవ్రంగా కలచివేసింది : వైఎస్.జగన్**

కర్నూలు ఘోర బస్సు ప్రమాదంపై వైసిపి అధినేత వైఎస్.జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. " కర్నూలు శివారు చిన్నటేకూరు వద్ద హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో పలువురు సజీవదహనమవడం అత్యంత విషాదకరం. ఈ ఘోర ప్రమాదం నన్ను తీవ్రంగా కలచివేసింది. మరణించినవారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలి" అని జగన్ ట్వీట్ చేశారు.

## బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నాం

సహాయాన్ని ప్రకటించింది. శుక్రవారం కర్నూలులోని వ్యాస్ ఆడిటోరియంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి ప్రమాద వివరాలను వెల్లడించారు. ప్రమాద సమయంలో బస్సులో నలుగురు చిన్నారులు, 39 మంది పెద్దలు ఉన్నారని హోం మంత్రి తెలిపారు. 19 మంది చనిపోయారని వెల్లడించారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆరుగురు చొప్పున, కర్ణాటక, తమిళనాడు నుంచి ఇద్దరు చొప్పున, బీహార్, ఒడిశా నుంచి ఒక్కొక్కరు ఉన్నారని ఆమె వివరించారు. మరో మృతదేహాన్ని ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు. ప్రమాదంలో గాయపడిన తొమ్మిది మందికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**డీఎన్ఏ పరీక్షలతో మృతదేహాల గుర్తింపు**

ప్రమాద తీవ్రతకు మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయని హోం మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, మృతుల గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. శాంపిల్స్ సేకరించి, కుటుంబ సభ్యుల డీఎన్ఏతో సరిపోల్చిన తర్వాతే మృతదేహాలను వారికి అప్పగిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టవచ్చని, బాధితుల కుటుంబాలు సహకరించాలని కోరారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు**

ఈ దారుణ ఘటనపై ఇప్పటికే కేసు నమోదు చేశామని, దర్యాప్తును ముమ్మరం చేశామని మంత్రి అనిత తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం ఆధారంగా కొన్ని కీలక అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను నిగ్గు తేల్చేందుకు 16 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అన్ని కోణాల్లో లోతైన దర్యాప్తు జరుగుతుందని ఆమె హామీ ఇచ్చారు. దర్యాప్తు నివేదిక వీలైనంత త్వరగా ప్రభుత్వానికి అందుతుందని పేర్కొన్నారు.

**బాధితులకు ప్రభుత్వ అండ**

అనంతరం, రవాణా శాఖ మంత్రి రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు తక్షణ సహాయక చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదంలో మరణించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. అలాగే, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ దుర్ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. దర్యాప్తు పూర్తయితే ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తాయి.

## ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదు

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రమాదం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం, తక్షణమే సహాయక చర్యలు ముమ్మరం చేయాలని, సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదంలో మరణించిన వారి వివరాలను వెంటనే గుర్తించి, వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన, నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వైద్యారోగ్య శాఖకు స్పష్టమైన సూచనలు చేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లోనూ బస్సుల సాంకేతిక పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ట్రావెల్స్ యాజమాన్యాలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని విచారణలో తేలితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రమాదానికి గురైన బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వంటి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను కోరారు. మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని వీలైనంత త్వరగా అందిస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. అధికారులు ఇప్పటికే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ వన్ చేస్తా...

నిలబెట్టడమే నా లక్ష్యం. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా తెలుగువారు ఉన్నత స్థాయిలో ఉండాలని నేను మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. 30 ఏళ్ల క్రితం తాను ఐటీకి పునాదులు వేయడం వల్లే నేడు తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా టెక్ నిపుణులుగా రాణిస్తున్నారని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ సీఈఓగా సత్య నాదెళ్ల వంటి వారు తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటుతున్నారని కొనియాడారు. 2024 ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం ప్రవాసాంధ్రులు ఎంతో తపించారని, వారి మద్దతు మరువలేనిదని కృతజ్ఞతలు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తన వద్ద స్పష్టమైన ప్రణాళిక ఉందని చంద్రబాబు వివరించారు. "గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తీసుకొచ్చాను. ఇప్పుడు అదే స్ఫూర్తితో విశాఖపట్నానికి గూగుల్ తీసుకువస్తున్నాం. సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ సంస్థ విశాఖలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది" అని ప్రకటించారు. దేశంలోనే 'క్వాంటం వ్యాలీ' ఉన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గర్వంగా చెప్పారు. "ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. ఐటీ, కమ్యూనికేషన్ల రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటున్నాం" అని తెలిపారు. పాలనలో సాంకేతికతను జోడిస్తూ వాట్సప్ ద్వారా 730కి పైగా పౌర సేవలను అందిస్తున్నామని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని చంద్రబాబు వివరించారు. అబుదాబీ, దుబాయ్ నగరాలు ఆయిల్ ఎకానమీ నుంచి పర్యాటకం, నాలెడ్జి ఎకానమీ వైపు ఎలా పయనిస్తున్నాయో స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. లక్షన్నర హోటల్ రూములతో దుబాయ్ ఆతిథ్య రంగంలో అద్భుతాలు సృష్టిస్తోందని, అదే తరహా అభివృద్ధిని ఏపీలో సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## త్వరలో యూఏఈ - ఏపీ మధ్య సరికొత్త వాణిజ్య బంధం

పలువురు యూఏఈ మంత్రులను, అక్కడ వాణిజ్య సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. ముందుగా యూఏఈ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. యూఏఈ ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వాణిజ్య బంధాన్ని పెంపొందించే అంశంపైనా, లాజిస్టిక్స్, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడుల గురించి ఇరువురు నేతలు చర్చించారు. భారత్-యూఏఈ దేశాలు నాలెడ్జ్ ఎకానమీపై ప్రస్తుతం దృష్టి పెట్టినట్టుగానే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాలన, పౌరసేవలను మరింత మెరుగ్గా అందించే అంశంపై ఏపీకి సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. సాంకేతికంగా పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్టీజీఎస్ ద్వారా ఇచ్చిపుచ్చుకునే అంశంపై ఇరువురు అవగాహనకు వచ్చారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-దుబాయ్ సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై రెండు ప్రభుత్వాలు ఒక అంగీకారానికి వచ్చాయి. ముఖ్యంగా ఆహార భద్రతకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌తో కలిసి పనిచేసేందుకు యూఏఈ ఆర్థిక వ్యవహారాల మంత్రి ఆసక్తి కనబరిచారు.

**యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రితో భేటీ**

యుఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ జియౌదితోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన బృందంతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు పక్షాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారం అంశాలపై చర్చ జరిగింది. థానీ బిన్ అహ్మద్ భారతదేశం -యుఏఈల మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహబంధాన్ని ప్రస్తావిస్తూ, రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో భాగస్వామ్యంతో పాటు... ముఖ్యంగా అమరావతిలో పెట్టుబడులు పెట్టే అంశంపై థానీ ఆసక్తి చూపించారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని థానీ అన్నారు. త్వరలోనే రాష్ట్రాన్ని సందర్శిస్తామని చెప్పారు.

**రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానం**

దుబాయ్ వర్చువల్ అసెట్స్ రెగ్యులేటరీ అథారిటీ (VARA) మేనేజింగ్ డైరెక్టర్ దీపా రాజా కార్బన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై చర్చలు జరిపారు. డిజిటల్ ఎకానమీ, ఫిన్‌టెక్, బ్లాక్‌చైన్, వర్చువల్ అసెట్ రెగ్యులేషన్, క్రిప్టో, డిజిటల్ ట్రాన్సాక్షన్ సెక్యూరిటీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్-దుబాయ్ మధ్య భాగస్వామ్య అవకాశాలను ముఖ్యమంత్రి విశ్లేషించారు. ఏపీ ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో ఉందని, ఫిన్‌టెక్ వాలీ విశాఖపట్నం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ వంటి ప్రాజెక్టులు డిజిటల్ ఇన్నోవేషన్‌కు కేంద్రాలుగా ఎదుగుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. వర్చువల్ అసెట్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, డిజిటల్ కరెన్సీ సేఫ్టీ నార్మ్స్, బ్లాక్‌చైన్ ఆధారిత ప్రభుత్వ సేవల అమలు కోసం సంయుక్తంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. దీనికి దీపా రాజా సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, క్రౌన్ ఎల్ఎన్జీ సీఈఓ స్వపన్ కటారియాతోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఎల్ఎన్జీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్-క్రౌన్ ఎల్ఎన్జీ మధ్య భాగస్వామ్య అవకాశాలపై ఇరువురు మాట్లాడుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలను పరిశీలిస్తామని కటారియా చెప్పారు. మరోవైపు ట్రైస్టార్ గ్రూప్ సీఈఓ యూజిన్ మేయిన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి లాజిస్టిక్స్, ఇంధన రవాణా, సప్లై చైన్ మేనేజ్‌మెంట్, గ్రీన్ ఫ్యూయెల్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరించారు. ఏపీ సుదీర్ఘ తీర ప్రాంతం కలిగి ఉందని... పోర్టులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి ఆస్కారం ఉందని తెలిపారు. ఆస్టర్ గ్రూప్ స్థాపకుడు డాక్టర్ అజాద్ మూపెన్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. సమావేశంలో ఆరోగ్య సేవల విస్తరణ, మెడికల్ ఎడ్యుకేషన్, టెలీ-హెల్త్, హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలు, హెల్త్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఏపీలో ఆస్టర్ గ్రూప్ పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయి మెడికల్ సదుపాయాలు స్థాపించాలని ఆహ్వానించారు. దీనికి అజాద్ మూపెన్ ఆసక్తి వ్యక్తం చేశారు. అపారెల్ గ్రూప్ సీఈఓ నీలేశ్ వేద్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. టెక్స్టైల్, గార్మెంట్ తయారీ, రిటైల్, ఫ్యాషన్ పరిశ్రమ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. దీనికి స్పందించిన నీలేశ్ వేద్ ఏపీలో అపారెల్ మాన్యుఫాక్చరింగ్, రిటైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి గురించి పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు.

## 13 నెలల నిరంతర శ్రమ ఉంది

మాట్లాడుతూ.. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ కు ఆహ్వానించినందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దేశంలో మీ పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ను ఎందుకు పరిగణించాలో మూడు ప్రధాన కారణాలు చెబుతాను. ఏపీలో అనుభవం కలిగిన దార్శనిక నాయకత్వం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. పెద్ద ప్రాజెక్టులను రాష్ట్రానికి ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. దీనివల్ల దేశంతో పాటు ఏపీలో కూడా సాఫీగా పెట్టుబడులు పెట్టేందుకు మీకు సహకారం లభిస్తుంది. ఏపీలో 50శాతం మంది ఎమ్మెల్యేలు కొత్తగా ఎన్నికయ్యారు. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు ఉన్నారు. రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు మేమంతా కసితో పనిచేస్తున్నాం.

**మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్**

రెండో కారణం.. ఏపీ స్టార్టప్ స్టేట్. చేపట్టిన పనులు పూర్తిచేయాలనే ధృడసంకల్పంతో ఉన్నాం. మీరు ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్. మొదటగా మేం ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేస్తాం. ఆయా ప్రాజెక్ట్ కు సంబంధించిన అధికారులు, నాయకులతో నిరంతరం ప్రాజెక్ట్ పురోగతిపై రోజువారీ పద్ధతిలో చర్చిస్తాం. ప్రాజెక్ట్ ఏ దశలో ఉందో, ఏం చేయాలో తెలుసుకుంటాం.

**ఏపీకి గూగుల్ సంస్థ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉంది**

ఏపీకి గూగుల్ డేటా హబ్ గురించి అందరూ వినే ఉంటారు. దాని వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉంది. ఆ సంస్థ నాయకత్వం మొదట వచ్చినప్పుడు నేను స్వయంగా వాళ్లను తీసుకెళ్లి ప్రాజెక్ట్ వచ్చే స్థలాన్ని చూపించాను. తర్వాత నేను వారి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి ఎందుకు ఏపీని ఎంచుకోవాలనే అంశంపై వారిని ఒప్పించాను. తర్వాత గూగుల్ నాయకత్వం వచ్చి ముఖ్యమంత్రి గారిని ఏపీలో కలిశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పులు చేయాలని వారు కోరారు. ప్రధానమంత్రి మోదీ గారు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారు, కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గారితో మాట్లాడి అవసరమైన విధానపరమైన సవరణలు చేశాం. దీంతో గూగుల్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు.. భారతదేశం గ్లోబల్ డేటా సెంటర్ హబ్ గా ఎదిగేందుకు మార్గం సుగమమైంది. ఆ ప్రాజెక్ట్ ను మేం 13 నెలల్లోనే పూర్తిచేశాం. మేం చెప్పిన సమయం కంటే ఒక నెల మాత్రమే ఆలస్యమైంది. నెల ఆలస్యంపై ఇప్పటికీ మేం బాధపడుతుంటాం. ఆదిత్య మిట్టల్ గారు, నాకు మధ్య ఒక్క జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఆర్సెల్లర్ మిట్టల్ ఏపీకి వచ్చింది. ఇందుకు కావాల్సిన అనుమతులపై ప్రధాని మోదీ గారితో చర్చించి మార్గం సుగమం చేశాం. నవంబర్ లో ఈ ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేయనున్నాం. 15 నెలల్లోనే ఈ ప్రాజెక్ట్ ఏపీకి వ్చచింది.

**ఏపీకి 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే**

గత 16 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టబడులు వచ్చాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. దేశంలో సాఫ్ట్ ల్యాండింగ్ కు మేం మీ వెంటే ఉంటాం. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో మీ ప్రతి ఆలోచన, ప్రాజెక్ట్ కు మేం పూర్తి మద్దతు ఇస్తాం. మీ పెట్టుబడుల గమస్థానంలో ఏపీని ఎందుకు ఎంచుకోవాలనేందుకు మూడో కారణం.. మాది జాతీయ దృక్పథం కలిగి ఉన్న ప్రాంతీయ పార్టీ. రెండు రాష్ట్రాల్లో ఉన్నాం. ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ దేశ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తాం. దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా మేం ఎప్పుడూ జాతీయ విధానాలపై సానుకూల ప్రభావం చూపాం. ఈ ప్రక్రియలో ఏపీకి కూడా ప్రయోజనం లభించింది. గతంలో చంద్రబాబునాయుడు గారి హయాంలో కూడా టెలికాం, విమానయాన రంగం, డిజిటల్ చెల్లింపులు వంటి సంస్కరణల్లో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు డేటా సెంటర్ విధాన సంస్కరణల్లో కీలకపాత్ర పోషించారు.

**ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం**

ప్రస్తుత ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో చేయాల్సిన విధానపరమైన మార్పులు గుర్తించి, వాటిని అమలుచేసే పనిలో ఉన్నాం. ఇందుకు ఉదాహరణ కార్మిక సంస్కరణలు. 9 సంస్కరణల్లో మార్పులు చేయాలని సూచించారు. 8 సంస్కరణలను 15 రోజుల్లోనే మేం పూర్తిచేశాం. మేం ప్రస్తుతం 180 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాం. దీనిని 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తీసుకెళ్తాం. మేం కేవలం ఒకటి, రెండు రంగాలపైనే దృష్టిపెట్టలేదు. 15 రంగాలపై దృష్టి కేంద్రీకరించాం. క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తాం. ఆటోమోటివ్, సిమెంట్, పునరుత్పాదక రంగం, ఎలక్ట్రానిక్స్, కంప్రెస్డ్ బయోగ్యాస్, ఫార్మా, స్టీల్, ఆక్వా, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. దేశంలో తయారవుతున్న ఏసీల్లో సగం ఏపీలోని తయారవుతున్నాయి. దీనిని 70శాతానికి తీసుకెళ్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం.

## ఏపీకి తుపాను ముప్పు..

తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఈడీ దీపక్ తో పాటు ఇతర కీలక అధికారులు పాల్గొన్నారు. తుపాను సన్నద్ధత, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై హోంమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ప్రస్తుత పరిస్థితిని హోంమంత్రికి వివరించారు. నైరుతి, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం సోమవారానికి తుపానుగా బలపడే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో శనివారం భారీ వర్షాలు, ఆదివారం అతి భారీ వర్షాలు, సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో తుపాను తీవ్రతను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, ప్రభావితమయ్యే జిల్లాల యంత్రాంగాన్ని తక్షణమే అప్రమత్తం చేయాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. "తుపాను కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చూడటమే మన ప్రథమ కర్తవ్యం. ఇందుకోసం ముందస్తు సహాయక చర్యలను పటిష్టంగా అమలు చేయాలి" అని హోంమంత్రి స్పష్టం చేశారు. సహాయక చర్యల నిమిత్తం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరమైన ప్రాంతాలకు వెంటనే తరలించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులు మరింత అప్రమత్తంగా ఉంటూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో 24/7 పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు, అధికారులకు చేరవేయాలని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, అక్కడ నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని హోంమంత్రి ఆదేశించారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, బాధితులకు నాణ్యమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. తుపాను అనంతరం విరిగిన చెట్లను తొలగించడం, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. అత్యవసర సహాయం కోసం విపత్తుల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో చెట్లు, హోర్డింగుల కింద నిలబడరాదని, భారీ వర్షాల సమయంలో వీలైనంత వరకు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు కూడా హోంమంత్రి పలు సూచనలు చేశారు. సోషల్ మీడియాలో వ్యాపించే వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని కోరారు.

## దృష్టి సారించండి

అవినాష్ ఎంపికయ్యారు. వీరితో పాటు గతంలో APLలో ఆడిన ఇతర ఆటగాళ్లను కూడా వివిధ IPL జట్లు తమ జట్టులో చేర్చుకున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్/విక్టోరియాలలో క్రికెట్ క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ఉమ్మడి శిక్షణా శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్ లు నిర్వహించే అంశాన్ని పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. క్రికెట్ సౌకర్యాలు, ఈవెంట్ల నిర్వహణలో పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించాలి. మహిళా క్రికెట్ క్రీడాకారులకు అవకాశాలను విస్తరించే కార్యక్రమాలపై దృష్టిసారించాలని కోరారు. లైవ్ స్ట్రీమింగ్, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అభిమానుల అనుభవాన్ని మెరుగుపర్చేందుకు చొరవచూపాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. క్రికెట్ విక్టోరియా ప్రతినిధులు మాట్లాడుతూ... భారతదేశంలో జారీ చేయబోయే క్రికెట్ విద్య డిప్లొమాలు, డిగ్రీలపై మేం ఆసక్తిగా ఉన్నాం. భారత్ లో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. మహిళల క్రికెట్ అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తాం. విక్టోరియా రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడం, క్రీడాసౌకర్యాలను అభివృద్ధి చేయడం మా లక్ష్యం. విక్టోరియా పురుషుల జట్టు (విక్టోరియా బుష్‌రేంజర్స్), విక్టోరియన్ మహిళల జట్టు (విక్టోరియా స్పిరిట్)తో సహా విక్టోరియా ప్రొఫెషనల్ క్రికెట్ జట్లను క్రికెట్ విక్టోరియా పర్యవేక్షిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక క్రికెటర్ల ప్రోత్సానికి జూనియర్ క్రికెట్, స్కూల్ ఈవెంట్స్, కమ్యూనిటీ క్లబ్ లకు మద్దతు ఇస్తున్నాం. అంతర్జాతీయంగా పేరొందిన మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్ సహా రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నాం. విక్టోరియా బుష్‌రేంజర్స్ షెఫీల్డ్ షీల్డ్ (ఫస్ట్-క్లాస్ క్రికెట్), మార్ష్ వన్-డే కప్ (దేశీయ వన్డే పోటీ)లో పోటీపడుతుడగా, విక్టోరియా స్పిరిట్ మహిళల జట్టు జాతీయ క్రికెట్ లీగ్ (WNCL), మహిళల బిగ్ బాష్ లీగ్ (WBBL) లలో తలపడుతున్నట్లు చెప్పారు.

## రాజ్యాంగంపై అవగాహన పోటీల్లో

# రావులపాడు విద్యార్థుల ప్రతిభ



**రావులపాలెం, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రావులపాలెం మండల మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వ వికాస (ఎలక్యూషన్) పోటీల్లో రావులపాడు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శుక్రవారం మండల అభివృద్ధి కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ పోటీల్లో రావులపాడు హైస్కూల్ విద్యార్థులు అగ్రస్థానాలు సాధించారు. ఎలక్యూషన్ పోటీలో మొదటి బహుమతిని ఎం. పూజిత, రెండవ బహుమతిని టి. నిత్యా గెలుచుకున్నారు. వ్యాసరచన విభాగంలో మొదటి బహుమతిని ఎస్. షర్మిల అందుకున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను మండల విద్యాధికారులు నాగకుమార్, శ్రీనివాస్ రాజు, రావులపాలెం గర్ల్స్ హైస్కూల్ SMC ఛైర్మన్ కోట సోమేశ్ అభినందించి బహుమతులు అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ టీచర్ కె.వి. శేఖర్ ను ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, పీ.వి. గిరి, జ్యోతి బాస్ తదితరులు అభినందించారు.

# చెముడులంకలో వృద్ధుడి నేత్రదానం

## భార్య ఆశయాన్ని నెరవేర్చిన కుటుంబ సభ్యులు



**ఆలమూరు, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
రక్తదానం మాదిరిగానే గ్రామీణ ప్రాంతాల్లో నేత్రదానంపై కూడా ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. మరణానంతరం మరో ఇద్దరికీ చూపుని అందించే గొప్ప సేవగా నేత్రదానం పట్ల సానుకూల దృక్పథం నెలకొంటోంది. డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక గ్రామానికి చెందిన చోడపనీడి వీర్రాజు (81) వృద్ధాప్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. భర్త మరణంతో బాధలో ఉన్నప్పటికీ ఆయన కళ్లు దానం చేయాలని భార్య సరస్వతి పట్టుదలగా నిర్ణయించడంతో కుటుంబ సభ్యులు నిడదవోలు శ్రీమతి రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెముడులంకకు చేరుకుని వీర్రాజు నేత్రాలను సేకరించి తీసుకెళ్లారు. వీర్రాజు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ః "81 ఏళ్ల వయస్సు వచ్చినప్పటికీ ఎప్పుడూ కళ్లజోడు అవసరం లేకుండా ఆరోగ్యంగా ఉన్న ఆయన నేత్రాలు మంటల్లో కలవకుండా, మరొకరికి చూపుని ఇవ్వాలని నిర్ణయించుకున్నాం" అన్నారు. ఈ సందర్భంగా నేత్ర ఆసుపత్రి ప్రతినిధి సుధారాణి మాట్లాడుతూ ః "మరణం తరువాత ఆరు గంటల లోపు నేత్రదానానికి సమాచారం ఇవ్వాలి. మృతుని కళ్లపై తడిగుడ్డ ఉంచాలి. మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్స్‌లో ఉంచితే 24 గంటల వరకు నేత్రాలు సేకరించే అవకాశం ఉంటుంది" అని తెలిపారు. నేత్రదానం చేయాలనుకునేవారు 93904 34887 నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చని చెప్పారు. వీర్రాజు నేత్రాలు దానం చేసిన కుటుంబాన్ని గ్రామస్థులు, బంధువులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు

# నకిలీ ఐదు వందల నోటుతో చింతపల్లిలో కలకలం!

## వ్యాపారుల్లో ఆందోళన%-%పోలీసులు అప్రమత్తం.



**చింతపల్లి, అక్టోబర్ 24 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
చింతపల్లి పట్టణంలో నకిలీ ఐదు వందల రూపాయల నోటు చలామణి కలకలం రేపింది. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని రహదారి పక్కన ఉన్న ఓ కిరాణా దుకాణంలో సామాగ్రి కొనుగోలు చేసిన ఓ వ్యక్తి 500 రూపాయల నోటుతో



చెల్లించి వెళ్లిపోయాడు. ఆ తర్వాత దుకాణదారు ఆ మొత్తాన్ని బ్యాంకులో జమ చేయడానికి వెళ్లగా, బ్యాంకు క్యాషియర్ ఆ నోటును పరిశీలించి అది నకిలీ నోటు అని గుర్తించారు. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులు వెంటనే దుకాణదారునికి తెలియజేయడంతో అతడు షాక్‌కు గురయ్యాడు. ఘటనతో వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. స్థానికులు, వ్యాపారులు ఇలాంటి నకిలీ నోట్ల చలామణి జరుగుతుంటే మనం ఎలా నమ్మాలి? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణాల్లో కూడా ఇటువంటి ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో చింతపల్లి ప్రజలు అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించి నకిలీ నోటు ఇచ్చిన వ్యక్తిని గుర్తించేందుకు దుకాణందారుడు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు ఆ వ్యక్తి జాడ లభించలేదు. నకిలీ నోట్లు గుర్తించడం కష్టం కాదు. నిజమైన ?500 నోట్లలో మహాత్మా గాంధీ చిత్రానికి ఎడమవైపున జలచ్ఛాయ (వాటర్మార్క్), భద్రతా తీగ, రంగు మారే అక్షరాలు, ఎంబెడ్డెడ్ నంబర్ ఉంటాయి. నోటును కొంచెం తిప్పి చూసినప్పుడు రంగు మారకపోతే అది నకిలీగా భావించాలని అధికారులు వివరించారు. పెద్ద నోట్లను స్వీకరించే ముందు రెండుసార్లు పరిశీలించాలని, అనుమానం ఉన్నప్పుడు వెంటనే సమీప బ్యాంకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ప్రతిరోజూ నోట్లతోనే వ్యాపారం చేస్తున్నాం. నకిలీ నోట్లు ఇలా వస్తే నష్టం మాకే అవుతుంది. అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

## చింతలూరు పాఠశాల విద్యార్థులకు

# రైన్ కోట్లు, బహుకరణ

### దాతృత్వంతో ముందుకొచ్చిన స్థానిక టిడిపి నాయకులు





**ఆలమూరు, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రైన్ కోట్లు, పాఠశాల అవసరాల కోసం మిక్సీని బహుకరించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు, మండల విద్యాశాఖ అధికారి బి.అప్పాజీ చేతుల మీదుగా విద్యార్థులకు రైన్ కోట్లు అందజేశారు. చింతలూరు పాఠశాల విద్యార్థులు రూపొందించిన బోధన కార్యక్రమాలు, సామాజిక సందేశ వీడియోలు సోషల్ మీడియాలో చూసిన ఏడిద గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు వాసంశెట్టి శేషు కుమార్ విద్యార్థులు వర్షకాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రైన్ కోట్లు అందించగా, చింతలూరు గ్రామ టిడిపి అధ్యక్షుడు వైట్ల గంగరాజు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన మిక్సీని బహుకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ.రాజు మాట్లాడుతూ ః విద్యార్థుల సౌకర్యం కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలు సాధించాలని సూచించారు. తదుపరి పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దుర్గాదేవి, గ్రామ టిడిపి సీనియర్ నాయకులు వైట్ల శేషుబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ఎస్.యానం బీచ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అయితాబత్తుల

**అమలాపురం అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఎస్.యానం బీచ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరిశీలించారు. జనవరిలో జరుగు సంక్రాంతి సంబరాలలోపు అన్ని పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ఆనందరావు







ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యేఅయితాబత్తుల ఆనందరావు . ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు హామీ ఇవ్వడం జరిగింది.

# చింతపల్లి తహాశీల్దార్‌గా శంకరరావు బాధ్యతల స్వీకరణ



**చింతపల్లి, అక్టోబర్ 24 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
చింతపల్లి మండల తహాశీల్దార్‌గా కే. శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ కార్యాలయంలో ఘనంగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఇప్పటివరకు చింతపల్లి మండల తహాశీల్దార్‌గా విధులు నిర్వహించిన జి. ఆనందరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండల తహాశీల్దార్‌గా పనిచేసిన శంకరరావును చింతపల్లి మండలానికి బదిలీపై చేరారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ మండల ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కుటుంబానికి చేరేలా కృషి చేస్తాను. భూసంబంధిత సమస్యలు, రైతుల పంటల సమస్యలు, పత్రాల జారీ వంటి అంశాల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తాను. మండల అభివృద్ధి దిశగా అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతాను అని అన్నారు. మాజీ తహాశీల్దార్ ఆనందరావు మాట్లాడుతూ చింతపల్లి ప్రజల ఆప్యాయత, సిబ్బంది సహకారం మరచిపోలేనిది. అందరి కలసికట్టుతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేయగలిగాం అని పేర్కొన్నారు. సిబ్బంది ఆనందరావును శాలువా కప్పి సన్మానించి, స్మారక చిహ్నం అందజేశారు. కొత్త తహాశీల్దార్ శంకరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్వో టి. పండయ్య, ఎస్. విష్ణు, వంశీ ప్రసాద్, నూకరాజు, తహాశీల్దార్ కార్యాలయ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్చుకోలేక వైసీపీ కుతంత్రాలు

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు

- నకిలీ మద్యం కుట్రల వెనక వైసీపీ పాపాలు
- చిల్లర ఆరోపణలు మానుకోవాలని జగ్గిరెడ్డికి హితవు

**రావులపాలెం, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
రాష్ట్రంలో కూటమి పాలన ప్రారంభమైనప్పటి నుంచి అభివృద్ధి దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తుండటాన్ని చూసి వైసీపీ నాయకులు తట్టుకోలేక కుట్రలకు పాల్పడుతున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ ః వైజాగ్‌కు గూగుల్ రావడం, అమరావతి నిర్మాణం శరవేగంగా కొనసాగుతుండటాన్ని చూసి వైసీపీ నాయకులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు కులవైషమ్యాలు, అబద్ధప్రచారాలు, కుట్రలే ఆయుధంగా చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పేరును ప్రస్తావిస్తూ విమర్శించారు. వైసీపీ హయాంలో నాసిరకం మద్యం వల్ల ఎన్నో కుటుంబాలు దెబ్బతిన్నాయని, రూ.3500 కోట్ల అక్రమ మద్యం కేసుల్లో ఇరుక్కున్న జగన్ అండ్ కో ఇప్పుడు నకిలీ మద్యం పేరుతో దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మద్యం షాపుల కేటాయింపు పారదర్శకంగా జరుగుతోందన్నారు. "నేను చిల్లర ఆరోపణలకు స్పందించను" అని ఇప్పటికే చెప్పినా, జగ్గిరెడ్డి మాత్రం అదే పాత ఆరోపణలను పునరావృతం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. "వైసీపీ నాయకులు కూడా షాపులు నడుపుతున్నారు, వారు ఎక్కువ ధరలకు మద్యం అమ్ముతున్నారని ఒప్పుకుంటారా?" అని ఆయన ప్రశ్నించారు. నకిలీ మద్యం నిర్మూలన కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్షా యాప్ ద్వారా ప్రతి బాటిల్



వివరాలు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలుసుకోవచ్చున్నారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడే తీరు గురివింద గింజ సామెతను తలపిస్తోందని ఎద్దేవా చేశారు. "ఇసుక, మద్యం అంటూ పాడిందే పాడరా పాచిపళ్ల పాట అన్నట్లు ఆయన ప్రవర్తన ఉంది" అని వ్యాఖ్యానించారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాల మూలాలు ఒక్కొక్కటిగా బయటపడుతుంటే తట్టుకోలేక కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని దుయ్యబట్టారు. నియోజకవర్గ అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని బండారు తెలిపారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లను కలిసి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాం. లొల్లలాకుల పునర్నిర్మాణం, కొత్తపేట ఆర్డీవో కాంప్లెక్స్, ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణం, వాడపల్లి రహదారి పనులపై సీఎం సానుకూలంగా స్పందించారు" అని చెప్పారు. పవన్ కళ్యాణ్ వెంటనే రావులపాలెం%-%వాడపల్లి రహదారి కోసం రూ.6 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. తాను తెచ్చే అభివృద్ధి నిధులు, చేస్తున్న పనులు వైసీపీ నాయకులకు కడుపునొప్పిగా మారాయని, అందుకే వారు అసత్య ఆరోపణలకు దిగుతున్నారని మండిపడ్డారు. "ప్రజలు అన్నీ గమనిస్తున్నారు, రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయాన్ని ఖాయం చేస్తారు" అన్నారు. కర్నూలు సమీపంలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంపై ఎమ్మెల్యే బండారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో రావులపాలెం ప్రాంతానికి చెందిన ఒకరు మృతి చెందడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి త్వరగా ఆరోగ్యం కుదాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, ముత్యాల బాబ్జి, పాలింగి రవిచంద్ర, గనిశెట్టి వీరేష్, పల్లి కుమార్ రాజా, యల్లమెల్లి జగన్మోహన్, మేడపాటి కాసురెడ్డి, చిన్నం శ్రీనివాస్ రెడ్డి, గుబ్బల వెంకటరమణ, వాసంశెట్టి సత్యనారాయణ, తమ్మన సాయిప్రసాద్, కోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 24(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** నగరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత మెరుగ్గా చేపట్టాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. శుక్రవారం తెల్లవారుజామున 8వ వార్డు ప్రకాష్ నగర్ పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ప్రతిరోజూ ఎంతమంది పారిశుద్ధ్య కార్మికులు విధులకు వస్తున్నది ఆరా తీశారు. ఉదయం 7 గంటలకు కల్లా డోర్ టూ డోర్ చెత్త సేకరణ మొదలు కావాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి రూట్ మ్యాట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే పలు వీధులలో శానిటేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. వర్షాల నేపథ్యంలో సైడ్ కాలువల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు పూడికను తొలగించాలన్నారు. రోడ్లపైన వ్యర్థాలు ఉండటానికి వీల్లేదని, ఊడ్చిన చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలన్నారు. ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలని, ఇందుకోసం స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే ఖాళీ స్థలం చుట్టూ గ్రీన్ మ్యాట్ ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్థానికులు చెత్త వేయకుండా పరిరక్షించవచ్చన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట నగర ఆరోగ్యశాఖాధికారి వినూత్న, ఇతర అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మంజూరైన పనులు త్వరగతిన పూర్తి చేయండి

### ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్



**రంపచోడవరం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఏజెన్సీలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల ద్వారా మంజూరైన పనులు వేగవంతముగా పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ఏపీవో జనరల్ డివిన్వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, అడిషనల్ ఎడియం%డ% హెచ్ఓ వివిధ శాఖలకు సంబంధించిన ఇంజనీర్లు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధి హామీ పథకం ఏపీఓలతో మంజూరైన పనులు వేగవంతముగా పూర్తి చేసే విధంగా ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధన ప్రకారం మంజూరైన వివిధ పనులు వేగవంతంగా పూర్తి చేసే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఆయన అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా పీఎం జన్మన్ పథకం ఫెజ్ వన్, పేజ్ టు ద్వారా ఎన్ని పనులు మంజూరు అయినవి? ఎన్ని పనులు పూర్తి చేసింది? ఎన్ని పనులు పెండింగ్ లో ఉన్నవి ఆయన ఆరా తీశారు. ఈ శాఖ ద్వారా ఎన్ని అంగన్వాడి కేంద్రాల భవనాల పనులు ఏ స్టేజిలో ఉన్నవి ఆయన ఆరా తీశారు. పూర్తి చేసిన అంగన్వాడి భవనాలు ఐసిడిఎస్ అధికారులు స్వాధీన పంచుకోవాలని ఆయన అన్నారు. డిఏజుగా పథకం ద్వారా ఎన్ని పనులు మంజూరు అయినవి. అదే విధంగా ఎన్ని భవనాలకు సంబంధించిన స్థల సమస్యలు ఉన్నవి. అదే విధంగా సీసీడీపీ పథకం ద్వారా ఎన్ని పనులు మంజూరు అయినవి. ఎన్ని పూర్తి చేసినది? ఎన్ని పనులు పెండింగ్లో ఉన్నవి ఆయన ఆరా తీశారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా పీఎం జన్మన్ పథకం ద్వారా ఎన్ని గృహాలు మంజూరైనవి ఎన్ని గృహాలు పూర్తి చేసింది. ఇంకా ఎన్ని గృహాలు పెండింగ్లో ఉన్నవి ఎప్పటిలోగా పూర్తి చేయుచున్నది. అదేవిధంగా టార్గెట్ ప్రకారం గృహాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. పీఎం గ్రామీణ, పీఎం జన్మన్ పథకం ద్వారా ఎన్ని గృహాలు మంజూరు అయినవి ఆయన ఆరా తీశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఎన్ని పనులు మంజుల అయినవి. ఎన్ని పనులు పూర్తి చేసింది. ఇంకా ఎన్ని పనులు పూర్తి చేయవలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా మంజూరు అయినవి. ఎన్ని పనులు పూర్తి చేసింది? ఎన్ని పనులు పెండింగ్లో ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ శాఖ ద్వారా ఎన్ని రోడ్లు మంజూరు అయినవి. ఎన్ని వంతెనలు మంజూరు అయినవి ఆయన ఆరా తీశారు. మంగంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రా భవన పనుల గురించి ఆయన ఆరా తీశారు. ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ భాగం ద్వారా జల జీవన్ మిషన్ ఎన్ని పనులు మంజూరు అయినవి, ఎన్ని పనులు భూమి పూజ చేసింది. ఇంకా ఎన్ని పనులు పెండింగ్లో ఉన్నది. అదే విధంగా ఇంకా ఎన్ని పనులకు టెండర్లు పిలవలసి ఉన్నది ఆయన ఆరా తీశారు. ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా సోలార్ సెట్లు ఏర్పాట్లు ఏ విధంగా జరుగుచున్నది ఆయన ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్న వారికి ఆధార్ లింకపుతో ఈ కేవైసీ ఏ విధంగా అప్లోడ్ చేయుచున్నది మండలాల వారిగా ఆయన ఆరా తీశారు. గిరిజన సంక్షేమ శాఖ పదో తరగతి విద్యార్థులకు సూపర్ 50 విధి విధానాలపై ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో ఎన్ని ఫీడర్ అంబులెన్స్ ఉన్నది, ఎన్ని 104 వాహనాలు ఉన్నది, ఎన్ని 108 వాహనాలు ఉన్నది అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో బర్త్ డేటింగ్ హాల్లో గురించి ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలో ప్రతి అంగన్వాడీ కేంద్రంలో చూపులైట్లు, ప్లే మెటీరియల్, త్రాగునీరు, మరుగుదొడ్ల సంబంధించిన నివేదికలు తయారుచేసి సమర్పించాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఏపిఓ జనరల్ డి ఎన్ వి రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డిఇలు చైతన్య, పి.వెంకటరమణ, రామచంద్ర మూర్తి, భవాని, సుబ్బారావు, శివ, ఉపాధి హామీ పథకం ఏపీవోలు, సిడిపిఓలు పాల్గొన్నారు.

## ఎస్.ఆర్. సంకు మరణం ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ (ఆలా)కు తీరనిలోటు

### -మేడా శ్రీనివాస్ శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 24(తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ లాయర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ గురువర్యులు స్వర్గీయ ఎస్ఆర్ సంకు మా నుండి దూరం అయ్యి నేటికి సంవత్సరం కావొస్తుందని తీవ్ర మనస్థాపం చెందారు. ఆయన లేని లోటు వెల కట్టలేనిది పూడ్చ లేనిది. ఆయన ఆశయ స్ఫూర్తికి అనుగుణంగా న్యాయవాద విలువలు భద్రత, సంక్షేమం కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తాం అన్నారు. సంకు గారి మానస పుత్రిక ఆంధ్ర లాయర్స్ అసోసియేషన్ ఆయన ఆశయ సాధనలో భాధిత న్యాయవాదుల కోసం నిరంతరం అండగా నిలుస్తుందని మేడా శ్రీనివాస్ తెలిపారు. "ఆలా" అధ్యక్షులు ఎమ్ వి రాజారామ్, కార్యదర్శి అవధానుల హరి వార్లు సంకు వర్ధంతి సందర్భంగా నివాళులు హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల నుండి అందచేశారు. కార్తీకమాస శుభ సందర్భంగా సంకు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాని ప్రగాఢ సానుభూతిని ఆలా తరుపున సానుభూతిని వ్యక్తపరిచారు.

## ఘనంగా ఆధ్యాత్మిక కళా కేంద్రం ప్రారంభోత్సవం

### హాజరైన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేకరి):** పెంటపాడు మండలం అలంపురంలో అదే గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు డాక్టర్ కొలనువాడ బంగార్రాజు నిర్మించిన శ్రీ సత్య సాయి రామానంద యోగి, రావమ్మ ఆధ్యాత్మిక కళా కేంద్రాన్ని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. డాక్టర్ బంగార్రాజు ఆధ్వర్యంలో శ్రీ వెంకటరమణ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొలనువాడ పెద్ద కృష్ణంరాజు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ అలంపురం గ్రామం రాజకీయాల కతీతంగా ప్రజలు ఐక్యతగా చేస్తున్న అభివృద్ధిని అభినందించారు. ప్రవాస భారతీయుడు బంగార్రాజు పుట్టిన గడ్డపై మమకారంతో, తన సద్గురు సత్య సాయి బాబా, తల్లిదండ్రులు రామానంద యోగి, రావమ్మల రుణం తీర్చుకోవడానికి వారి పేరట ఆధ్యాత్మిక కళా కేంద్రాన్ని ఏర్పాటు చేయటం, దానిని ఉచితంగా ప్రజలకి ఇవ్వడం అభినందించదగ్గ విషయమని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ తమ గ్రామ రుణాన్ని తీర్చుకోవాలని, సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ దాతను అభినందిస్తూ వారు చేపట్టే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని వివరించారు. దాత డాక్టర్ కొలనువాడ బంగార్రాజు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, గురువు రుణం తీర్చుకోవడానికి వారి పేరట భగవాన్ సత్యసాయి శత వర్ష జయంతి సందర్భంగా ఈ ఆధ్యాత్మిక కళాకాంద్రాన్ని ఏర్పాటు చేశామని, దానిని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఎంత ఎదిగామన్నది ముఖ్యం కాదని, సమాజానికి ఎంత ఉపయోగపడ్డామన్నదే ముఖ్యమని చెప్పారు. సమాజ వికాసానికి దోహదపడే ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఈ కేంద్రంలో వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకులు శ్రీ వెంకటరమణ సేవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొలనువాడ పెద్ద కృష్ణంరాజు మాట్లాడుతూ తన పిల్లల బాధ్యతలు పూర్తయ్యాయని, ఇక తన జీవితం సేవా కార్యక్రమానికే అంకితమని తెలిపారు. యోగ, సత్య సాయి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, తదితర కార్యక్రమాలకు ఉచితంగా ఇస్తామని తెలిపారు. తాను చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. వ్యాఖ్యాతగా రిటైర్డ్ హెడ్మాస్టర్ రామరాజు వ్యవహరించారు. భగవాన్ సత్యసాయిబాబా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు ఐతంపూడి శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి భోగి రెడ్డి ఆదిలక్ష్మి, మాజీ సర్పంచ్ కొలనువాడ సత్యనారాయణ రాజు, పెనుమర్తి హరిచంద్ర, సర్పంచ్ తాతిపూడి ప్రగతి, ఎంపీటీసీలు శ్రీదేవి, పుష్పలు, దాసరి అప్పన్న, ప్రత్తిపాడు గ్రామ జనసేన అధ్యక్షుడు చెరుకూరి పండు, భోగేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వరరావు, సత్యసాయి సేవా సమితి నాయకులు జనార్దన్ రావు, పాలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నిట్ ఆచార్యునికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

### సంతోష్ కుమార్ ను అభినందించిన ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి




**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 25 (తెలుగురాష్ట్రం విలేకరి):** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్ (ఏపీ నిట్) లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ గుగులోతు సంతోష్ కుమార్ యంగ్ సైంటిస్ట్ అవార్డును సింగపూర్ లో అందుకున్నారు. సింగపూర్ లోని నాన్యాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (ఎన్.టి.యూ) వారు ఇంజినీరింగ్ విభాగంలో పలు పరిశోధనలు చేసి అద్భుత ప్రతిభ కనబరిచిన వారికి ఏటా యంగ్ సైంటిస్ట్ అవార్డులను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలోభాగంగా డాక్టర్ సంతోష్ కుమార్ చేసిన బ్యాటరీ థర్మల్ మేనేజ్మెంట్ సిస్టం అనే పరిశోధనను మెచ్చుకుని ఎన్.టి.యూ నిర్వాహకులు యంగ్ సైంటిస్ట్ అవార్డుకు ఎంపిక చేశారు. విద్యుత్ వాహనాలకు సంబంధించిన బ్యాటరీ నాణ్యత ప్రమాణాలు, బ్యాటరీ కాలపరిమితిని పెంచటం వంటి అంశాలపై ఈయన పరిశోధించారు. ఎన్.టి.యూ నిర్వాహకులు గ్లోబల్ కాన్ఫరెన్స్ ఆన్ డీకార్బనైజేషన్ ఆఫ్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్ (జిసిడిఈఎం 2025) అనే అంశంపై సింగపూర్ లో నిర్వహించిన కాన్ఫరెన్స్ లో యంగ్ సైంటిస్ట్ అవార్డును లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన ఆచార్యులు మనీష్ చావ్లా చేతుల మీదుగా ఏపీ నిట్ ఆచార్యులు డాక్టర్ సంతోష్ కుమార్ కు అందజేశారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు లండన్, అమెరికా, మలేషియా, చైనా, భారతదేశం నుంచి 250 మందికి పైగా పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత సంతోష్ కుమార్ ను ఏపీ నిట్ ఇన్చార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్.వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ కే.హిమబిందు, పలువురు ఆచార్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సంతోష్ కుమార్ స్వస్థలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వరంగల్. ఈయన జేఎన్టీయూ హైదరాబాద్లో పిహెచ్డిని పూర్తి చేశారు. 2011లో హైదరాబాదులోని ఐసిఎఫ్ఏఐ బిజినెస్ స్కూల్లో అధ్యాపక వృత్తిని చేపట్టారు. ఏపీ నిట్ ఆచార్యునిగా 2019లో వచ్చారు. అసోసియేట్ డీన్ గా సేవలందించారు. ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా పని చేస్తున్నారు. సంతోష్ కుమార్ 2018లో యంగ్ ఇంటర్నేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గౌరవ్ అవార్డును, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో యంగ్ ఇంజనీర్ అవార్డును, తాజాగా సింగపూర్ లోని నాన్యాంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నుంచి యంగ్ సైంటిస్ట్ అవార్డును అందుకుని పలువురు ఆచార్యులకు స్ఫూర్తిగా నిలుస్తుండటం విశేషం.

## నూతన టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కమిటీ ఏర్పాటు



**కూనవరం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిర్యాల శిరీష దేవి భాస్కర్ ఆదేశాల మేరకు కూనవరం మండల పార్టీ ఆధ్వర్యంలో మండల తెలుగుదేశం ఎస్టీ సెల్ కమిటీని ప్రకటించారు. ఎస్టీ సెల్ అధ్యక్షులు కరక సర్వేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా మేడం. సీతారాములు, ప్రధాన కార్యదర్శి సేలం వెంకటేశ్వర్లు, కార్య నిర్వహణ కార్యదర్శులు అనిగే విజయబాబు, దాడి రాజేష్, మడకం వెంకట్రావు, కార్యదర్శులు గాడం రాజులు, తాటి బాలకృష్ణ, దానే ఆనంద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పోడియం అప్పారావు, ఉపాధ్యక్షులు చెలికను ఉమా మహేశ్వరరావు, తెలుగు రైతు సంఘం అధ్యక్షులు లంబు వాసు, యూనిటీ ఇన్చార్జులు దాసర నాగేశ్వరావు, కుంజ వెంకట్, మోసం రాము, మల్లెం నరసింహారావు, గ్రామ కమిటీ అధ్యక్షులు హెచ్. రవి, అరుకు పార్లమెంటు కార్యవర్గ సభ్యులు మడకం చిన్ని, గడ్డల భీమయ్య, మడకం శ్రీను కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసి గ్రామాలలో కోయ భాష పరిరక్షణ కోసం

## వాలంటీర్లను నియమించాలి

### రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళి




**కూనవరం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90 రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడే మురళి కొండ మొదలు, నేలదోనెలపాడు మెట్టగూడెం పాఠశాలలను సందర్శించి కోయత్తోర్ బాట స్వచ్ఛంద సంస్థ రూపకల్పన చేసిన కోయ భాష పద్యాలను విద్యార్థులకు పరిచయం చేయడం జరిగింది. కోయ భాష పద్యాలకు విద్యార్థుల నుండి విశేషమైన స్పందన రావడం జరిగింది. కావున పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులైన ఆదిమ తెగలకు తమ పూర్వీకులైన తాతల ముత్తాతల నుంచి వారసత్వ సంపదగా ఉన్న భాష, సంస్కృతి– సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు చరిత్ర మొదలైన వాటిని అప్పటి నుంచి ఇప్పటి వరకు కాపాడుకున్న అస్తిత్వాన్ని కనుమరుగవుతాయి. కాబట్టి అభివృద్ధిలో భాగంగా కడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు కట్టే ప్రాజెక్టులో వారు నష్టపోయే తెగల యొక్క భాష, సంస్కృతి, సాంప్రదాయాలు ఆచారాలు చరిత్రలను అస్తత్వాన్ని రక్షించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలదే. అలానే ప్రభుత్వాన్ని నడిపించే ప్రభుత్వ యంత్రాంగం అయినా జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ఇతర అధికారుల పైన ఉంటుందని సూచించారు. పోలవరం ప్రాజెక్టులో నిర్వాసితులైన దేవీపట్నం రంపచోడవరం, గంగవరం మండలాలలోని నిర్వాసిత గ్రామాలలో భాష పరిరక్షించడం కోసం కోయ భాషా వాలంటరీ నియమించాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 29, 30, 350ఏ ప్రకారం నిమ్న తెగల భాషా పరిరక్షణ కోసం వారికి ప్రాథమిక విద్య ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు వారి మాతృ భాషలోనే విద్యా బోధన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా అచ్చు వేయబడిన కోయ భారతి పుస్తకాలను భాష ఉన్న ప్రతి పాఠశాలకు అందే విధంగా చూడాలని కోరారు. ఆదిమ ఆదిమ తెగల పూజారులకు హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధమత పూజారులకు ఏ విధంగా అయితే గౌరవ వేతనం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయో.. అదే విధంగా షెడ్యూల్ తెగలలోనే ఉన్న ఆదిమ తెగల పూజారులకు గౌరవ వేతనం పదివేల రూపాయలు ఆంధ్ర ప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ శాఖా ద్వారా చెల్లించాలని అలానే షెడ్యూల్ ప్రాంతాల్లోని ఆర్థిక వనరు అయిన తాటి, జీలుగు కల్లుగీత కార్మికులకు బీమా సదుపాయాన్ని, సొసైటీలు ఏర్పాటు చేసి ప్రమాదాల గురైన కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని, అలానే తాడిచెట్టు జీడి మామిడి ద్వారా అనేక రకాలైన ఉత్పత్తులైన తాటి బెల్లం, నీరా, స్వీట్లు, పీచు, నారా మొదలైన రకాలైన వాటిని స్వీకరించి ఆదివాసి ప్రాంతాలలోని ఆదివాసి నిరుద్యోగ యువతకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీలు ఏర్పాటుచేసి ఆదివాసి యువతను ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటున ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సోడి దుర్గారావు, కత్రం వెంకటరమణ, మడివి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 70 సంవత్సరాలుగా సాగు చేస్తున్న భూమికి పట్టాలిప్పించండి



**కూనవరం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం చూచిరేవులగూడెం గ్రామ పంచాయతీ గిరిజన గ్రామమైన అయ్యవారిగూడెం గ్రామ ప్రజలము మా గ్రామ పరిధిలో ఉన్నటువంటి గ్యాప్ ఏరియా భూమిని షెడ్యూల్ ఏరియాలో ఆదివాసుల హక్కుగా మూడు తరాలుగా మా తాతల కాలం నుండి ఈరోజు వరకు కూడా వారసులుగా 70 సంవత్సరాలుగా మేము సాగు చేసుకుంటున్నాము. ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగి మాకు పట్టాలు ఇప్పించండి అని అడిగిన ఉపయోగం లేకుండా పోయింది. మా పేద ప్రజల బాధలను పట్టించుకునే పరిస్థితి లేదు. ఆఫీసుల చుట్టూ తిరిగి తిరిగి కాళ్ల చెప్పులు అరిగిపోయే తప్ప మా పేద గిరిజన ప్రజల మా సమస్య మాత్రం పరిష్కారం అవ్వలేదు. అయ్యా ఎంతో మంది అధికారులు మారారు మా సమస్య మాత్రం మారలేదు. మీరు అయినా మా యందు దయవుంచి అయ్యవారిగూడెం గ్రామ ఆదివాసి గిరిజన ప్రజల బాధలను గుర్తించి షెడ్యూల్ ఏరియాలో 1/70 యాక్ట్ పరిగణంలో తీసుకొని ఆదివాసులకు హక్కుగా భావించి 70 సంవత్సరాలుగా మేము సాగు చేస్తున్న భూమికి పట్టాలు ఇప్పించండి. ఈ కార్యక్రమంలో నూపా శేఖర్, నూపా నాగబాబు, వెట్టి వీరాజు, పొడియం నాగబాబు, సోడే సంతోష్, సోడే వీరబాబు, సోడే జోగారావు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**చింతూరు, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేకరి):**
అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని చింతూరులోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు విద్యార్థులకు లైంగిక వేధింపులనుండి మహిళల, పిల్లల రక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఐ పి. రమేష్ మాట్లాడుతూ పోలీసుల సేవ పై అవగాహన కల్పించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం యొక్క విశిష్టత అధికారులు విద్యార్థులకు ఈ దినోత్సవం గురించి వివరిస్తూ వారి యొక్క త్యాగాన్ని స్మరించుకోవడం విధి నిర్వహణలో, దేశ అంతర్గత భద్రతను కాపాడటంలో తమ ప్రాణాలను అర్పించిన వేలాది మంది అమర పోలీసుల త్యాగాలను ప్రతి ఏటా అక్టోబర్ 21న (ఆ వారంలో) స్మరించుకుంటామన్నారు పోలీసు వారి సేవలు %-% శాంతి భద్రతల పరిరక్షణ పోలీస్ వ్యవస్థ సమాజానికి అందిస్తున్న నిస్వార్థ సేవలను అధికారులు వివరించారు: శాంతి భద్రతలు పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని. ప్రజలు నిశ్చింతగా జీవించడానికి అవసరమైన శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు 24 గంటలు శ్రమిస్తారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112 ద్వారా ఎటువంటి ఆపద వచ్చినా, అందరికంటే ముందు స్పందించి ప్రజలకు సహాయం అందించేవారు పోలీసులేనన్నారు. నేర నియంత్రణ దొంగతనాలు, మోసాలు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మహిళలు, పిల్లలపై జరిగే నేరాలను నియంత్రిస్తూ, నిందితులను చట్టం ముందు నిలబెడతారన్నారు. ప్రజా మిత్రులు రోడ్డు ప్రమాదాలు, వరదలు, అగ్ని ప్రమాదాల వంటి విపత్తుల సమయంలో పోలీసులు ముందండి నడిచి ప్రజలకు ఆసరాగా ఉంటారని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థులలో దేశభక్తి, పోలీసుల పట్ల గౌరవం పెరగాలని యస్ ఐ తెలిపారు.

సచివాలయంలో నిర్వాసితుల జాబితాను

# నోటీస్ బోర్డ్‌లో పెట్టాలి

## వైస్ ఎంపీపీ భవాని ఆందోళన

**వి.ఆర్. పురం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని పోలవరం ముంపు ప్రాంతంలో చేర్చిన వడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన ష్ట్రక్చర్ వేల్యూ, రీహాబిలిటేషన్ అండ్ రీసెట్టిల్‌మెంట్ సర్వేల్లో తీవ్ర అవకతవకలు జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఆర్ అండ్ ఆర్ జాబితాను సచివాలయం నోటీస్ బోర్డ్ లో పెట్టాలని మండల వైస్ ఎంపీపీ ముత్యాల భవాని ఓ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఐఏఎస్ కి పంపిన పత్రికా ప్రకటనలో ఆమె పేర్కొన్న వివరాల ప్రకారం, పాడేరుకలెక్టర్ కార్యాలయం చాలా దూరంగా ఉండటంతో సోషల్ మీడియా వేదికగా అధికారుల దృష్టి తీసుకోని వస్తున్నట్లు తెలిపారు. సర్వేల్లో చిన్న ఇళ్లకు ఎక్కువ, పెద్ద ఇళ్లకు తక్కువ విలువలు నిర్ణయించడమే కాకుండా, ఆధార, రేషన్ కార్డులు లేని ఇళ్లకు విలువలు నిర్ణయించడం ప్రజల్లో అనుమానాలను రేకెత్తించిందని చెప్పారు. అలాగే, విదేశాల్లో స్థిరపడిన వ్యక్తుల పేర్లు , విలువల జాబితాలో ఉండటం సర్వేపై సందేహాలను పెంచుతోందని ఆమె అన్నారు. ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలను నివృత్తి చేయాలంటే వడ్డుగూడెం సచివాలయ భవనం వద్ద నిర్వాసితుల ఇళ్ల విలువలు,ఆర్ అండ్ ఆర్ డేటాను బహిరంగంగా ప్రదర్శించాలని భవాని సూచించారు. పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలంటే సర్వే వివరాలు ప్రజల ముందుంచాలని కోరారు. కలెక్టర్ వెంటనే ఫీల్డ్ లెవల్ అధికారులను పంపి విచారణ చేపట్టిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ సమస్య మండలంలో చర్చనీయాంశంగా మారిందని భవాని తెలియజేశారు.

# గుండె సమస్యతో బాధపడుతున్న మహిళకు బొలిశెట్టి ఆపన్న హస్తం



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేకరి):**
తాడేపల్లిగూడెం పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కర్రి కృష్ణ కుమారి గుండె సంబంధిత సమస్యలతో కొంతకాలంగా బాధ పడుతున్నారు. ఈమెకు అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి ఉందని, ఆలస్యమైతే ప్రమాదమని డాక్టర్ లు చెప్పడంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఆపరేషన్ కు అవసరమైన డబ్బు లు వారి వద్ద లేకపోవడం, తమ బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఈ విషయాన్ని 18వార్డు ఇంచార్జ్ పాపారావు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణ కుమారి పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వెంటనే స్పందించి ముఖ్యమంత్రి కార్యాలయం సిబ్బందితో ఫోన్ ద్వారా మాట్లాడి అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సొమ్ములు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు. వారు ఎటువంటి ఆలస్యం చేయకుండా రెండు రోజుల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,00,000 లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో బాధితురాలు కర్రి కృష్ణకుమారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. సకాలంలో స్పందించి ఆర్థిక సహకారం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కు కృష్ణకుమారి కుటుంబ సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డ్ ఇంచార్జ్ పాపారావు, రాజేష్, జనసేన పార్టీ పెంటపాడు మండల అధ్యక్షులు పుల్ల బాబి తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీహరి కుటుంబానికి ఆర్థిక సహాయం

## -మరోసారి మానవత్వం చాటిన డాక్టర్ సుందర్ ప్రసాద్



**వి.ఆర్. పురం, అక్టోబరు 24 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
ఆపద ఎవరికి వచ్చిన ఆదుకోవడంలో ఎప్పుడు ముందుండే వ్యక్తి మరోసారి ఆర్థిక సహాయం అందించారు. వడ్డీగూడెం గ్రామానికి చెందిన ముంజపు శ్రీహరి (దొడ్ల డైరీ) తీవ్రమైన అనారోగ్యంతో శుక్రవారం రోజున ఆసుపత్రిలో చేరారు. వైద్యులు అత్యవసరంగా మెదడు సంబంధిత శస్త్రచికిత్స చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు సుమారు పది లక్షల వరకు ఖర్చు అవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. అతని వైద్య ఖర్చులను భరించడం కష్టంగా ఉన్నందున స్థానికులు సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయం తెలిసిన డాక్టర్ సుందర్ ప్రసాద్ మానవతా దృక్పథంతో ముంజపు శ్రీహరి కుటుంబానికి తోడ్పాటుగా రూ.3,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయాన్ని ఆశా వర్కర్లు బాగుల మంజు భార్గవి, ముత్యాల మౌనికల చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. సుందర్ ప్రసాద్ సేవలను మండల ప్రజలు అభినందిస్తున్నారు. వృత్తిరీత్యా వేరే ప్రాంతానికి వెళ్లిన గతంలో ఇక్కడ పని చేసిన మరిచిపోకుండా ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడంలో ఆయన చూపిస్తున్న అభిమానం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఆరుగొలనులో ఈ నెల 27న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## -జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్24 (తెలుగురాష్ట్రం విలేకరి):**
మండలంలోని ఆరుగొలను రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు ప్రారంభం ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షించారు. టెక్నికల్ అసిస్టెంట్లు, సొసైటీ స్టాఫ్ తో మాట్లాడి శిక్షణ తరగతులు పూర్తయ్యాయా, లెవా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రం వద్ద కొనుగోలు కేంద్రాల గురించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు తెలిసే విధంగా వివరాలను డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు సంబంధించిన లావాదేవీలు, స్టాక్ రిజిస్టర్లు నిర్వహణ సంబంధించినవి పగడ్బందీగా ఉండాలని అన్నారు. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించాలన్నారు. ముందుగా తేమశాతం తెలిపే యంత్రాన్ని పరిశీలించారు.

**రైస్ మిల్లర్లతో సమీక్ష**

ఆర్డీవో ఛాంబర్ లో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు. ఆరుగోలను రైతు సేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్న దృష్ట్యా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఆర్ఎస్కేలో 50 శాతం గోనె సంచులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గోదాములలో సంచులను అందుబాటులో ఉంచాలని, రైతులు నుంచి ధాన్యం సేకరించడంలో ఎటువంటి అసౌకర్యము లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో ఖతీబ్ కౌసర్ భానో, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్ఓ ఎం.రవిశంకర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.గంగాధర్, ఎంఏఓ నారాయణరావు, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారి నారాయణరావు, ఎంఎల్ఓ లక్ష్మీకాంతం, జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆర్ఎస్కే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల ఆవరణలో నిల్వ నీటి తొలగింపు

## అధికారుల పర్యవేక్షణలో చర్యలు

**కొత్తపేట, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం )**
ఇటీవలి భారీ వర్షాల కారణంగా కొత్తపేట గ్రామంలోని కమ్మిరెడ్డిపాలెంలో ఉన్న మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీరు నిల్వ కావడంతో అధికారులు తక్షణమే చర్యలు చేపట్టారు. కొత్తపేట రెవిన్యూ డివిజినల్ అధికారి శ్రీ పి. శ్రీకర్ గారి ఆదేశాల మేరకు, కొత్తపేట తహసీల్దార్ శ్రీ పి. రాంబాబు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ పి. నరేష్ కుమార్ లు పాఠశాలను సందర్శించారు. మండల విద్యాశాఖాధికారి శ్రీ ఎం. హరి ప్రసాద్ తెలిపారు అధికారులు పరిస్థితిని పరిశీలించి, పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. విద్యార్థులు మరుగుదొడ్లు ఉపయోగించడంలో ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రోడ్డు పక్కన ఉన్న డ్రెయిన్‌లోని



పూడికను తొలగించి, ఆ నీటిని బయటకు తరలించే పనులు కూడా పూర్తిచేశారు. ఈ చర్యల్లో కొత్తపేట గ్రామ కార్యదర్శి శ్రీ డి. వెంకటేశ్వరరావు తక్షణ స్పందనతో సహకరించారని అధికారులు పేర్కొన్నారు. స్థానికులు అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవడంతో పాఠశాల పరిసరాల్లో సమస్యలు తగ్గాయని తెలిపారు.

మహిళలు - చిన్నపిల్లలు" లైంగిక దాడులు" అనే అంశంపై

# వ్యాసరచన పోటీ

## -పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం




**వి. ఆర్. పురం, అక్టోబర్ 24 (తెలుగురాష్ట్రం విలేఖరి):**
వి. ఆర్. పురం మండలం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక వ్యాసరచన పోటీ నిర్వహించటం జరిగింది. “మహిళలు, చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడుల అనే అంశంపై విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. విద్యార్థులు తమ ఆలోచనలు, అభిప్రాయాలను వ్యాసరచనలో వ్యక్తం చేశారు. విద్యార్థులు సమాజంలో మహిళలు, చిన్నారుల భద్రతను కాపాడే దిశగా యువతగా తమ బాధ్యత, పాత్ర, మార్పు అవసరం వంటి అంశాలపై చైతన్యవంతమైన వ్యాసాలు రాశారు. ఈ కార్యక్రమాన్ని వి.ఆర్. పురం ఎసై సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం పెరగడం వలన భవిష్యత్తులో సానుకూల సామాజిక మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడమే కాకుండా, సమాజ సేవకు ప్రేరణ కలిగించడమే ఈ వారోత్సవాల ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్ల పాతవీధి-బుడతల వేనం గ్రామాలకు తారు రోడ్డు నిర్మించండి!

## వర్షాల్లో నరకయాతన...గుంతలతో నిండిన మార్గం.

## అల్లూరి జిల్లా కలెక్టర్‌కు టిడిపి నాయకుల నాయకులు ఫిర్యాదు.

## చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనందరావు.





**చింతపల్లి, అక్టోబర్ 24 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
చింతపల్లి మండల పరిధిలోని అంతర్ల పాతవీధి, బుడతల వేనం గ్రామాలకు తారు రహదారి మంజూరు చేయాలని గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. జాతీయ రహదారి%-%516 ఈ నుండి ఈ రెండు గ్రామాల వరకు రహదారి పూర్తిగా దెబ్బతినడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో రోడ్డు గుంతలతో నిండిపోవడంతో వాహనాలు నడవడం కష్టమవుతోంది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడంలో, వృద్ధులు వైద్యసేవల కోసం ప్రయాణించడంలో, రైతులు పంట ఉత్పత్తులను మార్కెట్‌కి తరలించడంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చింతపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, ఉపాధ్యక్షుడు కోరాబు గాంధీ పడాల్, అరకు పార్లమెంట్ టిడిపి బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం లు పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి నుండి అంతర్ల పాతవీధి గ్రామం వరకు రోడ్డు గుంతలతో నిండిపోయింది. వర్షం పడితే వాహనాలు కదలడం సాహసమే అయిపోతోంది. బుడతల వేనం గ్రామానికి టిడిపి ప్రభుత్వం హయాంలో మంజూరైన రోడ్డు నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో ఆ మార్గం నిరుపయోగంగా మారిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకుండా, ప్రజలకు అవసరమైన రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, వైద్యం వంటి ప్రాథమిక సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ అంతర్ల పాతవీధి, బుడతల వేనం గ్రామాలకు వెళ్లే రహదారులను త్వరితగతిన పరిశీలించి, పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తాం అని హామీ ఇచ్చారు. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో షేక్ ఖాసిం వల్లి, టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కర్నూలు బస్సు ప్రమాదంలో కోనసీమ వ్యక్తి మృతి

**రావులపాలెం, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**



కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలానికి చెందిన వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాల్లోకి వెళ్తే ం రావులపాలెం ప్రాంతానికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (39) బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. శ్రీనివాసరెడ్డి క్రేన్ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తూ, రెండు రోజుల క్రితం క్రేన్ పనిమీద హైదరాబాద్ వెళ్లారు. అక్కడి నుంచి బెంగళూరుకు బస్సులో వెళ్తుండగా, కర్నూలు వద్ద ఈ దుర్ఘటన జరిగింది. మృతుడికి భార్య లక్ష్మీ జ్యోతి (గృహిణి), కుమారుడు వెంకటరెడ్డి (8వ తరగతి), కుమార్తె దివ్య (3వ తరగతి) ఉన్నారు. అదేవిధంగా ఆయన తండ్రి, మామగారు కూడా కుటుంబంతో నివసిస్తున్నారు. కుటుంబం మొత్తం శ్రీనివాసరెడ్డి ఆదాయంపైనే ఆధారపడి ఉందని సమాచారం. శ్రీనివాసరెడ్డి మృతి వార్త రావులపాలెం పరిసర ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కొత్తపేట డివిజన్‌లో ఆక్వా సాగు రిజిస్ట్రేషన్‌పై అధికారుల సమీక్ష



**కొత్తపేట, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం )**
కొత్తపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో ఆక్వా సాగు రిజిస్ట్రేషన్‌పై అధికారుల సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీ పి. శ్రీకర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో మత్య శాఖ సహాయ సంచాలకులు శ్రీ యల్.బి.యస్. వర్ధన్ (రాజోలు), కొత్తపేట డివిజన్ పరిధిలోని మత్య శాఖాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో వెల్లడైన వివరాల ప్రకారం, కొత్తపేట డివిజన్ పరిధిలో మొత్తం 1420.02 సెంట్లలో, ఇప్పటివరకు 563.19 సెంట్లు ఆక్వా సాగుకు రిజిస్ట్రేషన్ పొందగా, ఇంకా 856.83 సెంట్లు రిజిస్ట్రేషన్‌కు మిగిలి ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఆక్వా రైతులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ (లైసెన్స్) చేసుకోవాలని, దాంతో ప్రభుత్వ రాయితీలైన విద్యుత్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, బ్యాంకు రుణాలు, చెరువుల నిర్వహణలో %×శీ% పరికరాల రాయితీలు వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పొందగలరని అధికారులు సూచించారు. రిజిస్ట్రేషన్ చేయని రైతులు ఈ రాయితీలకు అర్హులు కాబోరని హెచ్చరించారు.

### వాసంశెట్టి సుభాష్ వ్యాఖ్యలను

## వక్రీకరిస్తున్న వక్రప్రచారకులు

### కుల సమావేశం రాజకీయ సమావేశం కాదంటూ వివరణ



**కొత్తపేట, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
అమలాపురంలో జరిగిన శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధన సన్నాహక సమావేశంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన వ్యాఖ్యలను కొంతమంది సోషల్ మీడియాలో వక్రీకరిస్తూ రాజకీయ రంగు పులుముతున్నారని శెట్టిబలిజ సంఘ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం పూర్తిగా కులానికి సంబంధించిన ఆధ్యాత్మిక, సామాజిక సమీకరణ కార్యక్రమం మాత్రమేనని, రాజకీయ సంబంధం లేదని స్పష్టం చేశారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ౹ "తాను శెట్టిబలిజ కులంలో పుట్టినందుకు గర్వపడుతున్నానని, తన ఎదుగుదలలో ఈ కులం అండగా నిలిచిందని" పేర్కొన్నారని, ఆ వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేయడం దురుద్దేశపూరితమని తెలిపారు. గత కొన్నేళ్లుగా వేలాది మందితో వన సమారాధన కార్యక్రమాలనుతెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి విజ్ఞప్తి చేశారు విజయవంతంగా నిర్వహిస్తున్న సుభాష్ నేతృత్వాన్ని వక్రీకరించడం తగదని, ఇటువంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల మూర్తి విజ్ఞప్తి చేశారు

### మద్యం వినియోగదారులు

## 'సురక్ష' యాప్ వినియోగించుకోవాలి

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు




**రావులపాలెం, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
మద్యం నాణ్యతను చెక్ చేసుకునేందుకు ప్రభుత్వం అందించిన "సురక్ష" యాప్‌ను వినియోగించుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. శుక్రవారం రావులపాలెం రింగ్ రోడ్డులో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్, ఎక్సైజ్ సీఐ కాత్యాయని లతో కలిసి స్థానిక మద్యం షాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ౹ "గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కల్తీ మద్యం సమస్య ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని, కూటమి ప్రభుత్వం మాత్రం మద్యం నాణ్యతపై కఠిన చర్యలు తీసుకుంటోందని" తెలిపారు. వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి బాటిల్‌పై ఉన్న %ు=% కోడ్‌ను 'సురక్ష' యాప్ ద్వారా స్కాన్ చేస్తే, ఆ మద్యం ఎక్కడ తయారైందో, దాని నాణ్యత వివరాలు తక్షణమే తెలుసుకోవచ్చని వివరించారు. స్వయంగా ఎమ్మెల్యే కొన్ని బాటిల్స్‌ను స్కాన్ చేసి ప్రజలకు వివరాలు చూపించారు. ప్రతి వినియోగదారుడు ఈ యాప్ ద్వారా మద్యం నాణ్యతను నిర్ధారించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంటంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, కొవ్వూరి అచ్చిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### చిన్నారుల చిరునవ్వే సమాజ బలం-అఘాత్యాలపై

# విద్యార్థుల చైతన్యం!

- మహిళా భద్రత-విద్యార్థుల కలం నుంచి మార్పు సందేశం!
- చింతపల్లి పోలీసుల చైతన్య స్ఫూర్తి-మహిళా రక్షణకు విద్యార్థుల శబ్దం!
- అమాయకులపై అఘాత్యాలకు చెక్-విద్యార్థుల్లో అవగాహన రగిలించిన పోలీసులు!

**చింతపల్లి ఎస్సై-2 వెంకటరమణ.**

చింతపల్లి, అక్టోబర్ 24 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి): మహిళలు, చిన్నారులు సురక్షితంగా ఉండే సమాజమే నిజమైన అభివృద్ధి దిశగా సాగుతుందని చింతపల్లి ఎస్సై%-%2 ఎం. వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఆయన చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల మధ్య మహిళలు, చిన్నారులపై అఘాత్యాల నివారణే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాత్యాలు సమాజంపై మచ్చలా మారుతున్నాయి. వాటిని అరికట్టడంలో విద్యార్థులు, యువత కీలక పాత్ర పోషించాలి. అవగాహనతోనే మార్పు సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమం చింతపల్లి సబ్‌డివిజన్ ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా సృజనాత్మక ఆలోచనల ఆధారంగా నిర్వహించబడిందని ఆయన తెలిపారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు త్వరలోనే ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా, సీఐ ఎం. వినోద్ బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు కార్యక్రమాన్ని సమన్వయం చేయగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులకు మహిళా భద్రత, సైబర్ క్రైమ్ నివారణ, చైల్డ్ లైన్ (1098) వంటి సేవల గురించి అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలల బోధన అధ్యాపకులు, బోధ నేతర అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







## మందపల్లి దేవస్థానంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



**కొత్తపేట, అక్టోబర్ 24:( తెలుగు రాష్ట్రం)**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు శుక్రవారం ఉదయం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ ఇంచార్జ్ పాలూరి సత్యానందం హాజరయ్యారు. అతిథులను అర్చకులు, వేదపండితులు శేషవస్త్రాలతో సత్కరించి వేదాశీర్వచనం అందించారు. ఈ సందర్భంగా మందపల్లి ఎంపీటీసీ సిద్దంశెట్టి వీర వెంకట సత్యనారాయణ, మాజీ ఛైర్మన్‌లు చింతం విజయకృష్ణ మోహనరావు, ధరణాల రామకృష్ణ, కొత్తపేట పీఎసీఎస్ ఛైర్మన్ కంటంశెట్టి సత్యప్రసాద్, పలివెల పీఎసీఎస్ ఛైర్మన్ తులా రాజు, మండల పార్టీ అధ్యక్షుడు జి.వీరేశ్, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బొక్క ఆదినారాయణ, బీజేపీ, టిడిపీ నాయకులు ముత్యాల బాబ్జీ, కంటంశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. నూతన ధర్మకర్తల మండలిలో గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగ భూషణం, నేరేడుమిల్లి మహాలక్ష్మి, గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంత లక్ష్మి సావిత్రి, దేవపాటి వేంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగశిరోమణి, తణుకు వీరభద్రరావు, కముజు స్వప్న, అయలూరి శ్రీరామ్మూర్తి, అలాగే అర్చక మరియు ఎక్స్ అఫిషియో సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. తదుపరి భక్తుల సౌకర్యార్థం సుమారు ?30 లక్షల వ్యయంతో నిర్మించిన 28 స్నానగదుల సముదాయాన్ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. కార్యక్రమాన్ని దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు.



### లెంటల్ లెవెల్‌లో ఆగిపోయిన

# లక్కవరం పాఠశాల భవనం..!

**తరాలు మారుతున్నా...గిరిజన విద్యార్థుల విద్య మార్పు రాదా..?**
**పశువుల పాకలో విద్యాబోధన-గిరిజన విద్యార్థుల భవితవ్యంపై ప్రశ్నార్థకం.**
**ఉపాధ్యాయుల అష్టకష్టాలు-అధికారుల నిర్లక్ష్యం..!**

**చింతపల్లి, అక్టోబర్ 24 (తెలుగు రాష్ట్రం ప్రతినిధి):**
గిరిజన ప్రాంతాల్లో విద్యా వెలుగు పంచాలనే ప్రభుత్వ వాగ్దానాలు వాయువ్యమైపోతున్నాయి. గూడెం కొత్తవీధి మండలంలోని దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని లక్కవరం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణం లెంటల్ లెవెల్ వరకు మాత్రమే సాగి, రెండు సంవత్సరాలుగా అలా మూతబడిపోయింది. పిల్లల భవిష్యత్తు కోసం నిర్మించాల్సిన విద్యాలయం ఇప్పుడు నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో పిల్లల బోధన ఇప్పుడు పశువుల పాక షెడ్‌లో సాగుతుంది. రేకులతో వేసిన తాత్కాలిక షెడ్ కింద నేలపై కూర్చుని విద్యార్థులు పాఠాలు నేర్చుకుంటుండగా, ఉపాధ్యాయులు ఆ దుస్థితిలోనూ విద్యాబోధన కొనసాగిస్తున్నారు.

**విద్యా హక్కు చట్టం ఉల్లంఘన.**

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి విద్యార్థికి సురక్షితమైన పాఠశాల భవనం, మరుగుదొడ్లు, త్రాగునీరు, ఆట స్థలం, బోధనా వాతావరణం అందించాలి. లక్కవరం గ్రామంలో ఇవన్నీ కలలో కూడా లేవు. వర్షం వస్తే నీరు కారుతుంది, ఎండలో వేడి తట్టుకోలేక పిల్లలు బయటకు వస్తారు, పాఠశాల విద్యార్థులకు దోమలతో ఇబ్బంది. ఇవన్నీ రోజువారీ కష్టాలుగా మారిపోయాయి.





**ఉపాధ్యాయుల కష్టాలు చెప్పలేనివి.**

పిల్లలు నేర్చుకోవాలనే ఉత్సాహంతో వస్తున్నారు. కానీ భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పుస్తకాలు, రికార్డులు భద్రపరచుకునే స్థలం లేదు. వర్షం పడితే క్లాసులు రద్దు చేసుకోవాల్సి వస్తుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా తాము ఏ పరిస్థితినైనా భరిస్తామంటున్నారు.

**గ్రామస్తుల ఆవేదన.**

పిల్లల కోసం కొత్త పాఠశాల కట్టిస్తారనుకున్నాం. కానీ గుత్తేదారుడు సగం పని చేసి పారిపోయాడు. ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడిచినా అధికారులు ఒక్కసారి కూడా అడుగుపెట్టలేదు. ఇది గిరిజన విద్యార్థుల పట్ల ప్రభుత్వం చూపుతున్న సవతి ప్రేమ కాదా? అని గ్రామ పెద్దలు ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం%-%ప్రభుత్వానికి హెచ్చరిక.**

గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిల్లల కోసం పాఠశాల పనులు వెంటనే పూర్తి చేయాలి. పశువుల పాకలో విద్యాబోధన కొనసాగించడం దారుణం. భవనం పనులు పూర్తి కానంతవరకు మన పిల్లల భవిష్యత్తు చీకట్లోనే మునిగిపోతుందని హెచ్చరిస్తున్నారు.

**తరాలు మారుతున్నా...విద్యలో మార్పు లేదు!**

స్వాతంత్రం సాధించి 78 ఏళ్లు పూర్తయ్యాయి. దేశం సాంకేతిక యుగంలో దూసుకెళ్తున్నా, గిరిజన విద్యార్థుల తలరాత మాత్రం మారడం లేదు. ఇంటర్నెట్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, స్మార్ట్ బోర్డులు గురించి మాట్లాడుతున్న ఈ కాలంలో, లక్కవరం విద్యార్థులు మాత్రం రేకుల షెడ్‌లో నేలపై కూర్చుని విద్యను పొందుతున్నారు. ఇది ఒక్క లక్కవరం కథ కాదు, ఇది అనేక గిరిజన గ్రామాల పాఠశాలల పరిస్థితి వాస్తవం.

**గ్రామస్తుల డిమాండ్.**

గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి. నిలిచిపోయిన పాఠశాల నిర్మాణాన్ని పూర్తి చేసి పిల్లలకు గౌరవప్రదమైన విద్యా వాతావరణం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఏకకంఠంగా కోరుతున్నారు.






తెలుగురాష్ట్రం దినపత్రిక
SPORTS NEWS
https://epaper.teluguraastram.com
అమలాపురం
అక్టోబర్ 25, శనివారం 2025


# సహనంగా ఉండు.. సోషల్ మీడియాను పట్టించుకోవద్దు

### కోహ్లీకి ఇర్ఫాన్ సూచన



వరుసగా రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడంతో విరాట్ కోహ్లీ ఇక ఆటకు గుడ్‌బై చెబుతాడనే చర్చ మొదలైంది. అయితే, ఇందులో పెద్దగా కంగారుపడాల్సిన అవసరమేమీ లేదని మాజీలు సూచించారు. ఒక్కసారి పరుగులు చేయడం మొదలుపెడితే ఆటోమేటిక్‌గా లయను అందుకుంటాడని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ తెలిపాడు. రెండు డకౌట్‌లు అయినంత మాత్రాన రిటైర్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు.

"ఇప్పటివరకు మనం విరాట్ కోహ్లీ వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్ కావడం చూడలేదు. ఇలా జరగడానికి ఒత్తిడి, ఆటకు దూరమవడం వంటి కారణాలు ఉండొచ్చు. సోషల్ మీడియాలో మాత్రం దీనిపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. విరాట్‌తోపాటు రోహిత్ విషయంలోనూ ఇదే డిస్కషన్. భారత్ కోసం వారిద్దరూ చాలా సాధించారు. ఇలాంటప్పుడు వారికి మద్దతు కావాలి. పరుగులు చేసేవరకూ సెలక్టర్లు నమ్మకం ఉంచాలి. యశస్వి జైస్వాల్ వంటి కుర్రాడు సిద్ధంగా ఉన్నప్పుడు సీనియర్లపై కత్తి వేలాడుతున్న భావన ఉంటుంది. ఇలాంటప్పుడు ఒత్తిడిని తట్టుకొని ఆటడం సులువేం కాదు. విరాట్ కోహ్లీ విషయంలో బలహీనతను అధిగమించడానికి ప్రయత్నించి పెవిలియన్‌కు చేరాడు. తొలి మ్యాచ్‌లో ఆఫ్‌సైడ్ బంతికి ఔట్ అయ్యాడు. ఇక రెండో మ్యాచ్‌లో తనకు ఇష్టమైన ఫ్లిక్ షాట్ మిస్ కావడంతో ఎల్బీగా పెవిలియన్‌కు చేరాడు. ఇంతకుముందు అతడి నుంచి ఇలాంటి ఆటను చూడలేదు. దీని నుంచి అతడు ఎలా బయటపడాలి? అనే సందేహం వస్తుంది. అయితే, విరాట్ సింగిల్ తీసి స్ట్రైక్ నుంచి బయటపడాలి అనుకుంటాడు. అలాగని నిరాశ పడకూడదు. అలా చేస్తే ఆటను ఆస్వాదించడం ఆగిపోతుంది. ఒక్కసారి పరుగులు చేయడం మొదలుపెడితే అతడిని ఆపడం కష్టమే. ఎందుకంటే వన్డేలంటే కోహ్లీకి చాలా ఇష్టం. ఈ సందర్భంగా అభిమానులకు ఓ విజ్ఞప్తి. దయచేసి ఎవరూ కూడా వరల్డ్ కప్‌లో ఆడతారా? లేదా? అనే చర్చ కొనసాగించవద్దు. ఇప్పుడు ఆ ఇద్దరూ ఆటను ఆస్వాదించేలా చూడాలి. వీలైనంత క్రికెట్‌ను ఆడేందుకు ప్రయత్నించాలి. తప్పకుండా విరాట్ తర్వాత మ్యాచ్‌లో ఫామ్ అందుకొంటాడని భావిస్తున్నా. అందుకోసం సహనంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే చర్చను అస్సలు పట్టించుకోవద్దు" అని ఇర్ఫాన్ వెల్లడించాడు.

### పట్టేశారు సెమీస్ బెర్తు అవసరం లేదు: గావస్కర్

"విరాట్ కోహ్లీ ఇప్పటివరకు వన్డేల్లో భారీగా పరుగులు చేశాడు. అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ కూడా అతడే. ఇప్పుడు వరుసగా రెండు మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన పెద్ద ఇబ్బందేమీ లేదు. మరీ ఎక్కువగా ఆందోళన చెందక్కర్లేదు. విరాట్, రోహిత్‌లో ఇంకా చాలా క్రికెట్ మిగిలిఉంది. సిడ్నీలో విరాట్ నుంచి మంచి ఇన్నింగ్స్ చూస్తామని అనుకుంటున్నా. ఆస్ట్రేలియాలో అతడికి ఎంతో ఇష్టమైన మైదానం. ఇక్కడ సెంచరీలు చేశాడు. ప్రతిఒక్కరూ అతడి నుంచి మరోసారి భారీ ఇన్నింగ్స్ రావాలని ఆశించడంలో తప్పు లేదు" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.

# మనోళ్లను ఉగ్రవాదులతో పోల్చిన పాక్ అధికారి.. నవ్వుకున్న నఖ్వీ..

**ఆసియా కప్ 2025 వివాదం మరింత ముదురుతోంది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య క్రికెట్ ట్రోఫీకి సంబంధించి మొదలైన ఘర్షణ ఇప్పుడు అభ్యంతరకరమైన వ్యాఖ్యల స్థాయికి చేరుకుంది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధిపతి అయిన మొహ్సిన్ నఖ్వీ తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియో మొత్తం క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ట్రోఫీని ఎత్తుకెళ్లిన దొంగగా కొందరు పేర్కొంటున్న నఖ్వీ సమక్షంలో కొందరు వ్యక్తులు భారత ఆటగాళ్లను ఉగ్రవాదులు అంటూ సంబోధించడం తీవ్ర కలకలం రేపింది.**



2025 ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, పాకిస్థాన్‌ను ఓడించి టైటిల్ గెలుచుకుంది. అయితే, మ్యాచ్ తర్వాత భారత జట్టు ట్రోఫీని స్వీకరించడానికి నిరాకరించడంతో వివాదం మొదలైంది. దుబాయ్‌లో నిర్వహించిన ట్రోఫీ సమర్పణ వేడుకలో పాల్గొనడానికి బీసీసీఐ నిరాకరించినట్లు వార్తలు వచ్చాయి. దీనికి ఏసీసీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ స్పందిస్తూ.. భారత జట్టు సభ్యులు దుబాయ్‌లోని అధికారిక కార్యక్రమంలో వ్యక్తిగతంగా వచ్చి ట్రోఫీని తీసుకుంటేనే ఇస్తామని స్పష్టం చేశారు. అప్పటి నుంచి ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలోనే ఉండిపోయింది. రెండు బోర్డుల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది.

తాజాగా, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియోలో మొహ్సిన్ నఖ్వీ పక్కన నిలబడిన ఒక వ్యక్తి భారత్‌కు వ్యతిరేకంగా తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. ఆ వ్యక్తి వీడియోలో.. "భారత జట్టు ట్రోఫీని తీసుకోనప్పుడు మా ఛైర్మన్ ఓపిక పట్టారు. కానీ తర్వాత ఆ జట్టును ఉగ్రవాదులు లాగా నిర్వహించారు. పాకిస్థాన్ హోంమంత్రి అయిన నఖ్వీ, ట్రోఫీని కారులో ఉంచి తీసుకువచ్చారు. ఇప్పుడు మొత్తం భారతదేశం ట్రోఫీ వెనుక పడుతోంది" అని వ్యాఖ్యానించాడు. షాకింగ్ విషయం ఏంటంటే.. ఈ వ్యక్తి అభ్యంతరకరంగా మాట్లాడుతున్న సమయంలో మొహ్సిన్ నఖ్వీ నవ్వుతూ కనిపించారు. ఆయన ఆ వ్యాఖ్యలను ఏమాత్రం ఖండించలేదు. ఈ వ్యవహారం భారత క్రికెట్ అభిమానులు, నిపుణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని, అసంతృప్తిని పెంచింది. మొహ్సిన్ నఖ్వీ ఈ వ్యాఖ్యలపై మౌనంగా ఉండటం అంటే, ఆ అభ్యంతరకర భాషను ఆయన పరోక్షంగా సమర్థించినట్లేనని క్రికెట్ నిపుణులు అంటున్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో బీసీసీఐ, ఐసీసీ స్పందన కోసం అంతా ఎదురుచూస్తున్నారు. ఈ ట్రోఫీ వివాదంపై వచ్చే నెలలో జరగనున్న ఐసీసీ సమావేశంలో చర్చ జరిగే అవకాశం ఉందని సమాచారం. ఈ సమావేశంలో బీసీసీఐ తన అభ్యంతరాన్ని తీవ్రంగా తెలియజేసి పీసీబీ నుండి అధికారికంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# గంటసేపు వేచి చూసినా మాకు ట్రోఫీ కనిపించలేదు: తిలక్ వర్మ



అరుదైన వ్యాధితో బాధపడినట్లు భారత ఆటగాడు తిలక్ వర్మ సంచలన విషయాలను ఇటీవల వెల్లడించాడు. ఆ సమయంలో ముంబయి ఇండియన్స్ మేనేజ్‌మెంట్ తనను ఆదుకొందని గుర్తు చేసుకున్నాడు. తాజాగా ఆసియా కప్ ట్రోఫీ వ్యవహారంపై స్పందించాడు. ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించడంలో ఈ తెలుగు కుర్రాడిదే కీలక పాత్ర. అయితే, భారత్ గెలిచినా ట్రోఫీ ఇవ్వకుండా ఏసీసీ అధ్యక్షుడు మోసిన్ నఖ్వీ 'పిల్ల చేష్టలు' సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ రోజు ఏం జరిగిందో తిలక్ వెల్లడించాడు. దాదాపు గంటసేపు మైదానంలో ఉన్నా సరే ట్రోఫీ తమకు కనిపించలేదని వ్యాఖ్యానించాడు.

"మేమంతా మైదానంలో వేచి చూస్తూ ఉన్నాం. అప్పటికి దాదాపు గంట గడిచిపోయింది. ఇదంతా మీరు టీవీల్లోనూ చూసి ఉంటారు. నాతోపాటు మన ఆటగాళ్లంతా గ్రౌండ్‌లోనే పడుకొని ఉన్నాం. అర్ష్‌దీప్ సింగ్ మాత్రం రీల్స్ చేయడంలో బిజీగా ఉండిపోయాడు. ట్రోఫీ వచ్చేసిందని ఆలోచిస్తూ మేమంతా అలాగే ఉండిపోయాం. కానీ, మైదానంలో ఎక్కడా కూడా ట్రోఫీ కనిపించలేదు. అప్పుడు అర్ష్‌దీప్ కలుగజేసుకొని.. ట్రోఫీ అందుకొన్నట్లుగా క్రియేట్ చేశాడు. టీ20 వరల్డ్ కప్ సమయంలో ఎలా సంబరాలు చేసుకున్నామో.. ట్రోఫీ లేకపోయినా అలాగే చేద్దామని చెప్పాడు. నాతో పాటు మరో ఐదారుగురు క్రికెటర్లు అలాగే చేశాం" అని తిలక్ తెలిపాడు.

### నమ్మకంతో ఉన్నాం..

"ఆసియా కప్‌లో మేం మూడుసార్లు పాక్‌ను ఢీకొట్టాం. ఫైనల్‌లోనూ గెలుస్తామని మొదటినుంచి నమ్మకంతోనే ఉన్నాం. క్రికెట్ తమాషా గేమ్. ఇలాంటి మెగా టోర్నీల్లో ఆడితే ఆ మజానే వేరు. నేను పాకిస్థాన్‌పై ఎలాంటి ప్యాషన్‌తో ఆడానో.. ఇతర మ్యాచుల్లో అలా ఆడలేకపోవచ్చు. కానీ, జట్టు విజయం సాధించేందుకు చేసే ప్రయత్నం మాత్రం ఆగదు" అని తిలక్ వ్యాఖ్యానించాడు.

# కన్నీళ్లు పెట్టకూడదని భావించా.. కానీ కివీస్ సారథి సోఫీ డివైన్ భావోద్వేగం



ఐదు ప్రపంచ కప్‌ల్లో ఆడిన న్యూజిలాండ్ మహిళా జట్టు కెప్టెన్ సోఫీ డివైన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ చేతిలో ఓటమితో వన్డే ప్రపంచ కప్ 2025 టోర్నీలో సెమీస్ అవకాశాలను కివీస్ కోల్పోయింది. దీంతో ఆదివారం ఇంగ్లాండ్‌తో మ్యాచ్ అనంతరం వన్డేలకు వీడ్కోలు పలుకుతానని వెల్లడించింది. ఈ సందర్భంగా భారత క్రికెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తమ దేశంలో డొమెస్టిక్ క్రికెట్ ఇంకా మెరుగవ్వాలని.. భారత్‌కు మాత్రం మహిళల ప్రీమియర్ లీగ్‌తో ప్రయోజనం చేకూరుతోందని తెలిపింది. డబ్ల్యూపీఎల్ వల్ల క్రికెట్‌కు గౌరవం వచ్చిందని వెల్లడించింది.

"ఎవరైనా సరే వాస్తవాలు మాట్లాడుకోవాలి. భారత్‌లో 150 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. మా దేశం చాలా చిన్నది. కేవలం ఐదు కోట్ల మంది మాత్రమే. భారత్‌లో దేశవాళీ క్రికెట్ వ్యవస్థ, నిర్మాణం మాతో పోలిస్తే చాలా భిన్నం. అందుకే, మా దేశ మహిళల క్రికెట్ ఎలా ముందుకు వెళ్తుందో ఆసక్తికరంగా చూస్తున్నా. ఆ స్థాయిలో మద్దతు లభించాలని కోరుకుంటున్నా. ఈ విషయంలో భారత్ ముందు వరుసలో ఉంటుంది. మహిళల క్రికెట్‌కు సపోర్ట్ చేస్తోంది. డబ్ల్యూపీఎల్‌తో క్రికెట్ గౌరవం పెరిగింది" అని సోఫీ పేర్కొంది.

### అందుకే ఈ నిర్ణయం..

"మా జట్టులో చాలా నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు. ఇసాబెల్ గేజ్, బ్రూక్, అమేలియా కెర్, ఈడెన్ కార్సెన్.. ఇలాంటి క్రికెటర్లు అద్భుతంగా ఆడతారు. నేను ఇప్పుడు జట్టును వదిలిపెట్టడం వల్ల కొత్త ప్లేయర్‌కు అవకాశం వస్తుంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్ అనంతరమే వెళ్లిపోతా. న్యూజిలాండ్ క్రికెట్ నాకు బిడ్డలాంటిది. ఈ జట్టు తరఫున ఆడటం ఎప్పుడూ గర్వపడతా. రాబోయే రోజుల్లో నేను భిన్నమైన అనుభూతులను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుసు. దేనికైనా కాలమే సమాధానం చెబుతుంది. ఈ ప్రెస్ కాన్ఫరెన్స్ సందర్భంగా కన్నీళ్లు పెట్టుకోకుండా వెళ్దామని అనుకున్నా. కానీ, నాకు చాలా కష్టంగా (భావోద్వేగానికి గురై) అనిపిస్తోంది. ఈ టోర్నీ చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై గెలిచి స్వదేశానికి వెళ్తామనే నమ్మకం ఉంది" అని సోఫీ డివైన్ తెలిపింది. 36 ఏళ్ల సోఫీ డివైన్ ఇప్పటి వరకు 158 వన్డేలు, 146 టీ20లను ఆడింది. మొత్తం 7,600కిపైగా పరుగులు చేసింది. ఇందులో 9 వన్డే సెంచరీలు, ఒక టీ20 శతకం ఉంది.

# టాప్-4లో బెంగళూరు



ప్రొ కబడ్డీ సీజన్-12లో బెంగళూరు బుల్స్ టాప్-4లో చోటు దక్కించుకుంది. గురువారం ఆ జట్టు 54-26తో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. ఎటాకింగ్, డిఫెన్స్‌లో అదరగొట్టిన బెంగళూరు విరామ సమయానికి 17-4తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధంలోనూ అదే జోరు కొనసాగించి ఘన విజయాన్ని అందుకుంది. ఆకాశ్ (11), అలీరెజా (10) ఆ జట్టును గెలిపించారు. 18 మ్యాచ్‌ల్లో 22 పాయింట్లతో బెంగళూరు లీగ్ దశను మూడో స్థానంతో ముగించింది. పుణెరి పల్టాన్ (26) అగ్రస్థానంలో.. దబంగ్ దిల్లీ (26), తెలుగు టైటాన్స్ (20) వరుసగా రెండు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. లీగ్ మ్యాచ్‌ల చివరి రోజు యూపీ యోధాస్ 35-32తో యు ముంబాను ఓడించగా.. పట్నా పైరేట్స్ 33-18తో జైపూర్ పింక్ పాంథర్స్‌పై నెగ్గింది. హరియాణా స్టీలర్స్, యు ముంబా, జైపూర్ కూడా ప్లేఆఫ్స్ చేరాయి.

# మినీ వేలానికి ముందే ఐదుగురికి షాకివ్వనున్న ముంబై ఇండియన్స్.. లిస్ట్‌లో రూ. 9 కోట్ల ప్లేయర్

ఐపీఎల్ 2026 (%ఖూూ% 2026) కోసం అన్ని జట్లు సిద్ధమవుతున్నాయి. డిసెంబర్ రెండవ వారంలో మినీ వేలం జరుగుతుంది. దానికి ముందు, అన్ని జట్లు నవంబర్ 15 నాటికి తమ వద్ద ఉంచుకున్న ఆటగాళ్ల పేర్లను ప్రకటించాల్సి ఉంది. ఈసారి, అందరి దృష్టి ఐదుసార్లు ఛాంపియన్స్ అయిన ముంబై ఇండియన్స్‌పై ఉంటుంది. గత సీజన్‌లో, హార్దిక్ పాండ్యా కెప్టెన్సీలో, జట్టు ప్లేఆఫ్ స్థానాన్ని దక్కించుకుంది. కానీ, ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓడిపోవడంతో ఎలిమినేట్ అయింది. మినీ వేలానికి ముందు, ముంబై తమ జట్టులో కొన్ని మార్పులు చేయడాన్ని పరిగణించవచ్చు. ఈ క్రమంలో విడుదల చేసే ఐదుగురు ఆటగాళ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. ఆఫ్ఘనిస్తాన్ లెగ్ స్పిన్నర్ ఏఎం గజన్‌ఫర్ తదుపరి ఆటగాడిగా విడుదలయ్యే అవకాశం ఉంది. అతను %ఖూూ% 2025లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అతన్ని జట్టు రూ. 4.8 కోట్లకు కొనుగోలు చేసింది. మిచెల్ సాంట్నర్ స్పిన్ దాడికి నాయకత్వం వహించడంతో అనేక మంది యువ స్పిన్నర్లు బాగా రాణిస్తుండటంతో, అతను బెంచ్‌లో ఉన్నాడు. అతని పరిమిత జాతీయ అనుభవం, ఇటీవలి టోర్నమెంట్లలో సాధారణ ప్రదర్శనలు కూడా అతన్ని నిలుపే అవకాశం లేదు. ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ రీస్ టోప్లీని కూడా %ఖూూ% 2026 కి ముందు విడుదల చేయవచ్చు. అతను 2025 సీజన్‌లో ఒకే ఒక మ్యాచ్ ఆడాడు. ట్రెంట్ బౌల్ట్ ఇతర భారత బౌలర్లతో పాటు పేస్ అటాక్‌కు నాయకత్వం వహించడంతో, టోప్లీ కనిపించడం చాలా తక్కువగా ఉంది. అతన్ని జట్టు రూ. 75 లక్షలకు కొనుగోలు చేసింది. దక్షిణాఫ్రికా కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ లిజాద్ విలియమ్స్ కూడా విడుదలయ్యే అవకాశం ఉంది. అతను %ఖూూ% 2025 లో ఎలాంటి మ్యాచ్‌లు ఆడలేదు. ప్రధానంగా ముంబైకి బ్యాకప్ బౌలర్‌గా పేరుగాంచాడు. అతను సీజన్‌లో ఎక్కువ భాగం నెట్ ప్రాక్టీస్ సెషన్‌లలో గడిపాడు. అతనికి ఆన్-ఫీల్డ్ అవకాశాలు లేకపోవడంతో, అతన్ని విడుదల చేయడం వలన ముంబై కొత్త బౌలర్లలో పెట్టుబడి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. ఫ్రాంచైజ్ అతన్ని రూ. 75 లక్షలకు కొనుగోలు చేసింది. ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన జట్టు ఫాస్ట్ బౌలర్ దీపక్ చాహర్‌ను విడుదల చేయవచ్చు. 2025 సీజన్ కోసం ముంబై ఇండియన్స్‌లో చేరడానికి ముందు చాహర్ చెన్నై సూపర్ కింగ్స్ (%జూఖ%)తో ఆరు సంవత్సరాలు గడిపాడు. ముంబై అతన్ని రూ. 9.25 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, అతని ప్రదర్శన అతని ధరకు తగినది కాదు. అతను 14 మ్యాచ్‌లలో కేవలం 11 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. ట్రెంట్ బౌల్ట్, జస్ప్రీత్ బుమ్రా వంటి కీలక ఫాస్ట్ బౌలర్లతో పాటు తన పవర్‌ప్లే బౌలింగ్‌ను బలోపేతం చేయడానికి ఫ్రాంచైజ్ ప్రత్యామ్నాయ ఎంపికల కోసం వెతకవచ్చు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

### తల్లి శ్రీదేవి కోసం రాసిన కవితను

# చదివి వినిపించిన జాన్వీ కపూర్

తల్లి శ్రీదేవిని గుర్తుచేసుకుని జాన్వీ కపూర్ భావోద్వేగం

ఒక టాక్ షోలో తాను రాసిన కవితను చదివి వినిపించిన నటి

"అమ్మ గొంతుతో మాట్లాడుతున్నా" అంటూ కవితలో హృద్యమైన వ్యాఖ్యలు



దివంగత నటి, అతిలోక సుందరి శ్రీదేవిని గుర్తుచేసుకుని ఆమె కుమార్తె, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తన తల్లిపై ప్రేమతో స్వయంగా రాసుకున్న ఒక కవితను ఓ టాక్ షోలో చదివి వినిపించి అందరినీ కదిలించారు. ఈ సంఘటనతో ఆమె తన తల్లిని ఎంతగా మిస్ అవుతున్నారో మరోసారి స్పష్టమైంది. నటులు ట్వింకిల్ ఖన్నా, కాజోల్ హోస్ట్‌లుగా వ్యవహరిస్తున్న "టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్" అనే కార్యక్రమానికి జాన్వీ కపూర్, కరణ్ జోహార్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లిని ఉద్దేశించి రాసిన కవితను ఆమె చదివారు. "బచీ థీ ఫిర్ అచానక్ ఏక్ దిన్ వో హఖ్ ఖో దియా, జో లాడ్ మాంగ్తీ థీ ఉస్సే ముహ్ మోడ్ లియా, అప్నీ ఆవాజ్ ఖో కే అప్నీ మా కీ ఆవాజ్ మే బాత్ కర్తీ హూ, ఇసీ జరియే మే ఉన్కో పాస్ భీ రఖ్తీ హూ," అంటూ ఆమె కవితను వినిపించారు. (నేనొక చిన్నపిల్లని, కానీ అకస్మాత్తుగా ఆ హక్కును కోల్పోయాను. ఎవరి ప్రేమ కోరుకున్నానో, వారికే దూరమయ్యాను. నా సొంత గొంతును కోల్పోయి, ఇప్పుడు అమ్మ గొంతుతో మాట్లాడుతున్నాను. ఈ రూపంలోనే ఆమెను నా దగ్గర ఉంచుకుంటున్నాను) అని ఆ కవిత సారాంశం. 2018 ఫిబ్రవరి 24న దుబాయ్‌లో ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో మునిగి శ్రీదేవి (54) మరణించిన సంగతి తెలిసిందే. జాన్వీ తొలి చిత్రం 'ధడక్' విడుదలకు కొన్ని నెలల ముందే ఆమె కన్నుమూయడం దేశవ్యాప్తంగా అభిమానులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. శ్రీదేవి మరణానంతరం, ఆమె భర్త బోనీ కపూర్ మొదటి భార్య పిల్లలైన అర్జున్ కపూర్, అన్షులా కపూర్.. తమ సోదరీమణులు జాన్వీ, ఖుషీ కపూర్‌లకు అండగా నిలుస్తూ వస్తున్నారు. శ్రీదేవి తర్వాత జాన్వీ 'గుంజన్ సక్సేనా', 'గుడ్ లక్ జెర్రీ', 'మిలీ', 'బవాల్', 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' వంటి చిత్రాలతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె చెల్లెలు ఖుషీ కపూర్ కూడా 2023లో 'ది ఆర్చీస్' సినిమాతో అరంగేట్రం చేశారు. ఇటీవల జాన్వీ కపూర్ నటించిన 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి' చిత్రం వంద కోట్ల క్లబ్‌లో చేరింది. వరుణ్ ధావన్, రోహిత్ సరాఫ్, సానియా మల్హోత్రా కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు మిశ్రమ స్పందనలు వచ్చినప్పటికీ, ఇందులో జాన్వీ నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి.

# 'పెద్ది' కోసం శ్రీలంక బయల్దేరిన రామ్ చరణ్

### శ్రీలంకలో 'పెద్ది' సినిమా కొత్త షెడ్యూల్ ప్రారంభం




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ చిత్రం 'పెద్ది'. ఈ సినిమా తదుపరి షెడ్యూల్ కోసం చిత్ర యూనిట్ శ్రీలంకకు పయనమైంది. కొన్ని రోజుల పాటు అక్కడి అందమైన లొకేషన్లలో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. రామ్ చరణ్ ఎయిర్‌పోర్ట్‌కు వెళుతున్న వీడియో ఒకటి ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. దీన్ని అత్యంత భారీ హంగులతో నిర్మిస్తున్నారు. ఇటీవల వినాయక చవితి రోజున, 'పెద్ది' యూనిట్ మైసూరులో ఓ భారీ పాటను చిత్రీకరించింది. ఏకంగా 1000 మంది డ్యాన్సర్లతో రామ్ చరణ్‌పై చిత్రీకరించిన ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఈ సినిమాలోని తన పాత్ర కోసం రామ్ చరణ్ పూర్తిగా కొత్త మేకోవర్‌లోకి మారినట్లు తెలుస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్ ఈ చిత్రంలో ఓ శక్తివంతమైన సహాయక పాత్రలో నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సినిమాను అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు, షుటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా సమాంతరంగా జరుపుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. స్వరమాంత్రికుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండడం ఈ సినిమాకు అదనపు ఆకర్షణగా మారింది. ఈ చిత్రానికి ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. 'పెద్ది' చిత్రాన్ని 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా పాన్-ఇండియా స్థాయిలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# 'ఉన్నట్టా.. మరి లేనట్టా..' పాట విడుదల



త్రినాథ్ కఠారి కథానాయకుడిగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'ఇట్లు మీ ఎదవ'. 'వెయ్యేళ్లు ధర్మంగా వర్ధిల్లు' అనేది ట్యాగ్‌లైన్. తెలుగమ్మాయి సాహితీ అవాంచ కథానాయికగా నటించారు. సంజీవని ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బళ్లారి శంకర్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఆర్పీ పట్నాయక్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఉన్నట్టా%ొ% మరి లేనట్టా%ొ%' అంటూ సాగే పాటని కథానాయకుడు శ్రీకాంత్ విడుదల చేసి మాట్లాడారు. 'ఈ సినిమా టైటిల్ చాలా కొత్తగా ఉంది. 'ఉన్నట్టా%ొ% మరి లేనట్టా%ొ%' పాట చాలా అద్భుతంగా ఉంది. ఆర్పీ పట్నాయక్ బాగా కంపోజ్‌చేశారు. త్రినాథ్, సాహితీ జోడీ చాలా బాగుంది. ప్రొడ్యూసర్ శంకర్, కెమెరామెన్ జగదీష్ నాకు మంచి మిత్రులు. ఈ సినిమా మంచి విజయం సాధించాలి" అని అన్నారు. 'ఉన్నట్టా%ొ% మరి లేనట్టా%ొ%' పాటకి పూర్ణాచారి లిరిక్స్ అందించగా, ఎస్పీ చరణ్, శ్రుతిక సముద్రాల పాడారు.

# 'స్పిరిట్' ఆడియో గ్లింప్స్ విడుదల




ప్రభాస్, సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం స్పిరిట్. అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ చిత్రాల విజయంతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపును సందీప్‌రెడ్డి తెచ్చుకున్నారు. ప్రభాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం రాత్రి 11 గంటలకు 'సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిలిం స్పిరిట్' అంటూ 1.31 నిమిషాల ఆడియో గ్లింప్స్ వదిలారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ గ్లింప్స్ విడుదల చేశారు. ఐపిఎస్ అధికారిగా ఈ సినిమాలో ప్రభాస్ నటిస్తున్నారు. 'వీడి గురించి విన్నాను.. యూనిఫామ్ ఉన్నా, లేకపోయినా ప్రవర్తనలో తేడా ఉండదని! ఖైదీ యూనిఫాంలో ఎలా ప్రవర్తిస్తాడో చూద్దాం.!' అంటూ ప్రభాస్ గురించి నటుడు ప్రకాష్‌రాజ్ వ్యాఖ్యానిస్తారు. 'మిస్టర్ సూపరింటెండెంట్ నాకు చిన్నప్పటినుంచి ఒక చెడ్డ అలవాటుంది' అంటూ ప్రభాస్ డైలాగ్ సగం చెప్పడంతోనే గ్లింప్స్ వీడియో పూర్తయింది. ప్రభాస్‌ను ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్‌స్టార్‌గా అభివర్ణిస్తూ టైటిల్ కార్డు కూడా వేశారు. త్రిప్తి డిమ్రి కథానాయిక. వివేక్ ఒబెరారు, కాంచన, ప్రకాష్‌రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రాణె సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.



# "స్కై" నుంచి 'పోయేకాలం నీకు'

# లిరికల్ సాంగ్ విడుదల

మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్ టైన్ మెంట్ స్టూడియోస్ బ్యానర్ పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా "స్కై". పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంతో శివ ప్రసాద్ అనే కొత్త మ్యూజిక్ డైరెక్టర్ ఇండస్ట్రీకి పరిచయమవుతున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న "స్కై" సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'పోయేకాలం నీకు..' అనే లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ పాటకు పృథ్వీ పెరిచెర్ల లిరిక్స్ రాయగా, యదు కృష్ణన్ మరియు వల్లవన్ పాడారు. శివప్రసాద్ క్యాచీ ట్యూన్ తో కంపోజ్ చేశారు. 'పోయేకాలం నీకు..' పాట ఎలా ఉందో చూస్తే %-% 'పోయేకాలం నీకు ముందుందని చెబుతుంటే, సచ్చిపోతున్నారు వినవే వినను అంటుంటే, రాంగే రైటై పోదని చెబుతూ నేను ఉంటున్నా, రైటే రైటంటు వేగంగా నువ్వు పోతున్నావ్, నీకోసం పోరి వస్తుంటే పో పో పొమ్మని తరిమేశావ్, చాల్లే నీకు నా గొడవే, ఎందుకు లే నన్ను వదిలేసెయ్..' అంటూ సాగుతుందీ పాట. "స్కై" చిత్రం నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన 'తపనే తెలుపగ..' సాంగ్ ప్రేక్షకాదరణ పొంది మిలియన్ వ్యూస్ రీచ్ అయింది, ఇప్పుడు ఈ 'పోయేకాలం నీకు..' సాంగ్ కు కూడా మంచి రెస్పాన్స్ వస్తుందని మేకర్స్ బావిస్తున్నారు. నటీనటులు - మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ భారతి, రాకేశ్ మాస్టర్, ఎంఎస్, కేవల్ కే మణి బమ్మ, తదితరులు

# ఫ్యాక్ట్ చెక్...

**దీపికా పదుకొణె ట్వీట్ వెనుక అసలు వాస్తవం ఇదే!**

**ప్రభాస్ పుట్టినరోజున 'స్పిరిట్' ఆడియో టీజర్ విడుదల**

**దీపికా పదుకొణె పేరుతో వైరల్ అయిన నకిలీ ట్వీట్**

**టీజర్ అద్భుతంగా ఉంది కానీ నేను బాధగా ఉన్నానంటూ పోస్ట్**



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమా నుంచి వచ్చిన ఆడియో టీజర్ సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే, ఈ హడావుడి మధ్యలో బాలీవుడ్ నటి దీపికా పదుకొణె పేరుతో వచ్చిన ఒక ఫేక్ ట్వీట్ తీవ్ర గందరగోళానికి దారితీసింది. ప్రభాస్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ టీజర్ విడుదల చేయగా, కొందరు ఆకతాయిలు ఈ ఫేక్ పోస్ట్‌తో తప్పుడు ప్రచారం మొదలుపెట్టారు. వివరాల్లోకి వెళితే, దీపికా పదుకొణె పేరుతో ఉన్న ఒక నకిలీ ఎక్స్ ఖాతా నుంచి, "'స్పిరిట్' వీడియో అద్భుతంగా ఉంది... కానీ నేను బాధగా ఉన్నాను సందీప్ రెడ్డి. ప్రభాస్ సర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. ఈ ట్వీట్ క్షణాల్లో వైరల్ కావడంతో, చాలామంది నిజంగా దీపికే పోస్ట్ చేశారని భావించారు. వాస్తవానికి ఈ సినిమాలో హీరోయిన్‌గా మొదట దీపికా పదుకొణెను సంప్రదించారు. అయితే, ఆమె అధిక పారితోషికం, లాభాల్లో వాటా, పరిమిత పని గంటలు వంటి డిమాండ్లు పెట్టడంతో ఆమెను ప్రాజెక్ట్ నుంచి తప్పించి, 'యానిమల్' ఫేమ్ తృప్తి డిమ్రిని హీరోయిన్‌గా తీసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే, ఆమెను సినిమా నుంచి తొలగించినందుకు బాధపడుతున్నట్లు ఉన్న ఈ ఫేక్ ట్వీట్‌ను చాలామంది నమ్మేశారు. ఇక ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' నుంచి 'సౌండ్-స్టోరీ' పేరుతో ఒక ఆడియో క్లిప్‌ను హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేశారు. దాదాపు నిమిషం నిడివి ఉన్న ఈ ఆడియోలో, జైలర్ తన అసిస్టెంట్‌తో మాట్లాడే సంభాషణలు ఉన్నాయి. రిమాండ్‌లో ఉన్న ఒక మాజీ పోలీస్ అధికారిని సాధారణ ఖైదీలా చూడాలని, బట్టలు విప్పి తనిఖీ చేయాలని జైలర్ ఆదేశాలు ఇవ్వడం ఉత్కంఠ రేపుతోంది. ఈ ఆడియో క్లిప్ ద్వారానే సినిమాలో ప్రభాస్‌తో పాటు తృప్తి డిమ్రి, కాంచన, ప్రకాశ్ రాజ్, వివేక్ ఒబెరాయ్ వంటి వారు నటిస్తున్నారని మేకర్స్ అధికారికంగా ధృవీకరించారు. ప్రస్తుతం ఈ 'సౌండ్-స్టోరీ' సినిమాపై అంచనాలను పెంచుతుండగా, మరోవైపు ఈ నకిలీ ట్వీట్ నెట్టింట అనవసర చర్చకు దారితీసింది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339